తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
RNI NO.TELTEL / 2013 /50370
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 04.10.2026 | సంపుటి :13 సంచిక : 75 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## కోట్ల సంవత్సరాల క్రితం
# నడయాడిన డైనోసార్లు..
## మంచిర్యాల మట్టిగడ్డపై చెరగని పాదముద్రలు
## 14 భారీ.. సుమారు 50 చిన్న పాదముద్రలు

మంచిర్యాల జిల్లాలో డైనోసార్ల శిలాజాలు

హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియంలో భద్రపరిచిన డైనోసార్ శిలాజాలు



మంచిర్యాల జిల్లాలో డైనోసార్ల సంచారానికి కీలక ఆధారాలు వెలుగుచూశాయి. సలిగావ్ పరిసరాల్లోని రాతిపొరలపై డైనోసార్ల పాదముద్రలు (ట్రాక్‌వేలు) గుర్తించారు. వేమనపల్లి ప్రాణహిత తీరంలో డైనోసార్ శిలాజాలతో పాటు, కోటపల్లి మండలం బొప్పారంలో సుమారు 230 మిలియన్ ఏళ్ల నాటి వృక్ష, జంతు శిలాజాలు లభించాయి. వేమనపల్లిలో గతంలో కోటసారస్ శిలాజాలను గుర్తించారు. తాజా పాదముద్రలు శాఖాహార సారోపాడ్, మాంసాహార థెరోపాడ్ డైనోసార్ల ఉనికికి ఆధారాలుగా నిలుస్తున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు.

## శిలాజాలను మంచిర్యాలకు తరలించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



ప్రాణహిత నది పరవళ్లు.. పచ్చని అటవీ అందాలు.. చారిత్రక కట్టడాలు.. కోట్ల సంవత్సరాల నాటి జీవుల ఆనవాళ్లు.. ఇలా ప్రకృతి, చరిత్ర, భౌగోళిక విశేషాలకు నిలయంగా మంచిర్యాల జిల్లా వేమనపల్లి ప్రాంతం నిలుస్తోంది. ముఖ్యంగా రాజారాం, సుంపుటం, ఒడ్డుగూడెం తదితర ప్రాంతాల్లో లభించిన డైనోసార్, వృక్ష శిలాజాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

పింగిళి సంపత్ రెడ్డి (మంచిర్యాల ప్రతినిధి, జనంసాక్షి)

వేమనపల్లి మండలం రాజారాం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు ఈ ప్రాంతంలో కోట్ల సంవత్సరాల క్రితం డైనోసార్ల ఉనికికి ఆధారాలను వెలుగులోకి తెచ్చాయి. రాళ్లపై కనిపించిన భారీ పాదముద్రలు, తవ్వకాల్లో లభించిన ఎముకలు తదితర అవశేషాలు అప్పటి జీవ వైవిధ్యాన్ని తెలియజేస్తున్నాయి. ప్రాణహిత గోదావరి లోయలోని ఈ ప్రాంతం డైనోసార్ల పరిశోధనకు ముఖ్యమైన ప్రదేశంగా గుర్తింపు పొందింది.రాజారాం సమీపంలో లభించిన డైనోసార్ అవశేషాల్లో సుమారు 14 మీటర్ల పొడవున్న కోటాసారస్ యామనపల్లి యెన్సిస్‌కు సంబంధించిన అస్థిపంజరం కూడా ఉంది. ఈ డైనోసార్

మిగతా 2లో..



మంచిర్యాల జిల్లా వేమనపల్లి ప్రాంతంలో బయటపడ్డ డైనోసార్ శిలాజాల పాదముద్రలు, ఇతర అవశేషాలు






# అదరగొట్టారు..
### ఇటు హాకీలో.. అటు క్రికెట్‌లో భారత్‌కు పసిడి పతకాలు

- మలేసియాతో ఫైనల్ మ్యాచ్‌లో 5-1 తేడాతో భారత హాకీ జట్టు ఘన విజయం
- ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా క్రికెట్ జట్టు
- శనివారం భారత్ ఖాతాలో నాలుగు బంగారు పతకాలు
- 85 పతకాలతో నాలుగో స్థానానికి చేరిన భారత్

టోక్యో(జనంసాక్షి): ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. ఈసారి పురుషుల క్రికెట్ జట్టు పసిడి పతకం అందించింది. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన శ్రేయస్ నాయకత్వంలోని టీమ్ ఇండియా 'గోల్డ్'తో మెరిసింది. దీంతో భారత్ ఆసియా క్రీడల పతకాల సంఖ్య 82కి చేరింది. ఇందులో 20 స్వర్ణాలు, 26 రజతాలు, 36 కాంస్యాలు ఉన్నాయి. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో

మిగతా 2లో..

# ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

- అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలి
- కలెక్టర్లతో పాటు అధికారులూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- విద్య, వైద్య శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజును ఆదేశించారు.విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్పత్రుల

మిగతా 2లో..

## ఎల్‌నినోను కాంగ్రెస్ ఎదుర్కోలేకపోయింది

ప్రభుత్వ చేతకానితనం వల్ల కరెంటు రాక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి:హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ మంత్రి, బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాగజ్ మద్దూర్ గ్రామంలో దయనీయమైన దృశ్యాన్ని చూసి

మిగతా 2లో..



## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

వయోభారంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

2లో..



## అనంతగిరి ఘాట్ రోడ్డులో ట్రావెల్స్ బస్సు బోల్తా..

- నలుగురి మృతి.. ఏడుగురికి గాయాలు
- ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

2లో..



### 22ఏ భూ సమస్యల పరిష్కారం దిశగా
# మరో కీలక నిర్ణయం

### నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టాభూముల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టాభూముల రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించింది. నాలా రుసుము చెల్లిస్తే అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని తీర్మానించింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను కాలపరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. 22ఏ భూ సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఐదు జీవోలు జారీ చేసింది. ఈ సమస్య పరిష్కారంపై అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ

మిగతా 2లో..

### పర్యాటక రంగంలో
# భారీ పెట్టుబడులు

- హిల్ట్ పాలసీ ఇండస్ట్రియల్ పార్కుల్లో అభ్యంతరాలు లేని దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేయాలి
- అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ
- కేబినెట్ సబ్ కమిటీ భేటీలో భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌ల ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): హిల్ట్ పాలసీపై అవగాహన కల్పించేందుకు ఆరు పారిశ్రామిక పార్కుల్లో రోడ్‌షోలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మంత్రుల నేతృత్వంలో రోడ్‌షోలు ఉండాలని సీఎస్‌కు భట్టి సూచించారు. హిల్ట్ పాలసీలో అభ్యంతరాలు లేని ఇండస్ట్రియల్ పార్కుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ.. ప్రభుత్వ ఆదాయాన్ని

మిగతా 2లో..



# కుట్ర కోణం లేదు

### దోపిడీ దొంగతనాల కోసమే ఆయుధాలు ఎత్తుకెళ్లిన మాజీ జవాన్లు
### 'బొల్లారం' కేసులో కీలక వివరాలు వెల్లడించిన సీపీ సుమతి



హైదరాబాద్(జనంసాక్షి): బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పురోగతి లభించింది. ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో ఆయుధాల చోరీ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శేషు, వినోద్, ప్రవీణ్, నిరంజన్, మల్లికార్జున్, బీర్బల్ షా, అవి దెయ్‌ను అరెస్టు చేశారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఏ2 శేషు, ఏ3 వినోద్, ఏ4 ప్రవీణ్ ఆర్మీలో పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. "ఆర్మీ ఆయుధాల కేసులో ఉగ్ర లింకులు లేవని తేలింది. ఆయుధాలతో బెదిరించి చోరీలు చేసే ఉద్దేశంతోనే కుట్ర జరిగింది. ఇక్కడి నుంచి తీసుకెళ్లిన ఆయుధాలను.. బ్యాంకులు, జ్యువెలరీ షాపుల్లో చోరీలకు వాడాలనుకున్నారు. ధనవంతులను బెదిరించి దోపిడీ చేయాలని నిందితులు కుట్ర చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఆయుధాలు కొనుగోలు చేసేందుకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీర్బల్ షా, అవి దెయ్.. వీరిని సంప్రదించారు. పిస్టల్‌కు రూ.3లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షల చొప్పున ఒప్పందం జరిగింది" అని సీపీ వివరించారు.

### డిజిటల్ వేదికగా
# సత్యాగ్రహ
### ప్రారంభించిన రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'సత్యాగ్రహ' పోర్టల్‌ను ప్రారంభించారు. తమ సమస్యలపై దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో ప్రజలు చేపడుతున్న నిరసనలను ఒకతాటిపైకి తీసుకువచ్చే లక్ష్యంతో ఈ డిజిటల్ వేదికను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో సత్యాన్ని అణచివేస్తున్నారని, దానిని అడ్డుకోవడం ప్రతిపక్ష

మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
04.10.2026

## మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన తెలంగాణ మంత్రులు

**హైదరాబాద్:** ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్తులో ఆటో, క్యాబ్‌లకూ దీన్ని అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. శనివారం డే పాస్‌తో ఇతర మంత్రులతో కలిసి భట్టి విక్రమార్క ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రోస్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మెట్రో రైలులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రులందరికీ కాంబో పాస్‌ను ఆయన కొనుగోలు చేశారు. "హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణావైపు ప్రయాణికులను ఆకర్షించడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చాం. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తాం" అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## 'మాకు గర్వకారణం'..

### స్మిత్ మచ్చర్‌కు దుబాయ్ యువరాజు ఆత్మీయ ముద్దు



**హైదరాబాద్:** ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని అబుధాబీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన వేగంగా కోలుకుంటున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. "భారత ధైర్యశాలి కెప్టెన్ స్మిత్ మెరుగైన వైద్య సంరక్షణలో ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నాం. యూఏఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని భారత ఎంబసీ తెలిపింది. మరోవైపు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. "ప్రయాణికుల ప్రాణాల విషయంలో అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన పైలట్‌ను పరామర్శించాను. ఆయన మా బృందంలో, దేశ చరిత్రలో ఒక భాగం. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలవడం మాకు గర్వకారణం" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# కోట్ల సంవత్సరాల క్రితం.. నడయాడిన డైనోసార్లు!

శాకాహారి జాతికి చెందినదిగా శాస్త్రీయ పరిశోధనల్లో గుర్తించారు. దాని అసలు అస్థిపంజరాన్ని హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్ డైనోరియంలో ప్రదర్శనకు ఉంచారు.

**వృక్ష శిలాజాలకు నిలయం**

వేమనపల్లి మండలంలోని సుంపుటం, ఒడ్డుగూడెం, వేమనపల్లి పరిసరాల్లో వృక్ష శిలాజాలు కూడా కనిపిస్తున్నాయి. వాగులు, వంకలు, భూభాగంలోని రాతి పొరల్లో పురాతన వృక్ష అవశేషాలు శిలాజాలుగా మారిన ఆనవాళ్లు గుర్తించబడ్డాయి. జీవుల అవశేషాలు మట్టి పొరల్లో దీర్ఘకాలం భద్రపడి, భూగర్భ ప్రక్రియల కారణంగా ఖనిజాలతో నిండిపోయి రాతి స్వరూపాన్ని సంతరించుకోవడమే శిలాజీకరణ. డైనోసార్లకు సంబంధించిన శిలాజాల్లో ఎముకలు, పుర్రెలు, దంతాలు మాత్రమే కాకుండా పాదముద్రలు, నడిచిన ఆనవాళ్లు వంటి జాడ శిలాజాలు కూడా ఉంటాయి. వేమనపల్లి ప్రాంతంలో లభించిన పాదముద్రలు అప్పటి డైనోసార్ల సంచారాన్ని అర్థం చేసుకోవడానికి కీలక ఆధారాలుగా నిలుస్తున్నాయి.

**కోట్ల సంవత్సరాల నాటి జీవ వైవిధ్యానికి ఆధారాలు**

ప్రాణహిత గోదావరి లోయలో తెలంగాణలోని మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల పరిధిలో కోట్ల సంవత్సరాల నాటి డైనోసార్ అవశేషాలు వెలుగుచూశాయి. శాకాహార, మాంసాహార డైనోసార్ జాతులకు సంబంధించిన ఆధారాలు ఈ ప్రాంతంలో లభించడం శాస్త్రవేత్తల పరిశోధనలకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. మరోవైపు వేమనపల్లి మండలం రాజారాం గ్రామంలో లభించే చారిత్రక శిల్పాలు, దశావతారాల విగ్రహాలు ఈ ప్రాంతానికి మరో ప్రత్యేకతను చేకూరుస్తున్నాయి. కాకతీయుల కాలానికి చెందినవిగా స్థానికంగా పేర్కొంటున్న ఈ విగ్రహాలు చారిత్రక ప్రాధాన్యతను చాటుతున్నాయి.

**మ్యూజియం ఏర్పాటుపై డిమాండ్**

వేమనపల్లి ప్రాంతంలో లభిస్తున్న డైనోసార్, వృక్ష శిలాజాలను స్థానికంగానే భద్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో ప్రత్యేక శిలాజ మ్యూజియం ఏర్పాటు చేస్తే తెలంగాణలోని పురాతన జీవ, భౌగోళిక సంపదను పరిరక్షించడంతో పాటు పర్యాటకంగా కూడా వేమనపల్లికి మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది. కోట్ల సంవత్సరాల చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన శిలాజ సంపదను కాపాడాల్సిన అవసరం ఉంది.

**రాజారాం గ్రామ అటవీ ప్రాంత తవ్వకాల్లో..**

మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న రాజారాం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో జురాసిక్ యుగానికి చెందిన రెండు వేర్వేరు రకాల రాకాసి బల్లులు (డైనోసార్స్)తిరిగినట్లు శాస్త్రవేత్తలు పాదముద్రల ఆధారాలు గుర్తించినట్లు తెలుస్తుంది. వాటికి సంబంధించిన అడుగుజాడలు రాళ్లపై స్పష్టమైన పాద ముద్రలుగా ఉన్నాయని ఉన్నాయని చారిత్రక ఆధారాలు చూపుతున్నాయి. వేమనపల్లి మండలం రాజారాం , కోటపల్లి ప్రాంతాలలో రాళ్లపై ముద్రితమైన డైనోసార్ల భారీ పాద ముద్రలు కూడా కనుగొనబడ్డాయి. దీని ఆధారంగా ఇవి ఆ కాలంలో ఎలా సంచరించబడ్డయో తెలియజేస్తున్నాయి. రాజారాం గ్రామ అటవీ ప్రాంతంలో 1974 నుండి 84 వరకు మధ్యకాలంలో శాస్త్రవేత్తలు జరిపిన తవ్వకాల్లో సుమారు 15 కోట్ల సంవత్సరాల క్రితం నాటి శాకాహార డైనోసార్ విశేషాలు లభించాయి. ఇక్కడ 12 డైనోసార్లకు సంబంధించిన 840 డైనోసార్ల ఎముకలు ముక్కలను సేకరించినట్టు సమాచారం.

> **డైనోసార్లు ఎన్ని రకాలు?**
>
> **శాఖాహార డైనోసార్లు :**
> ఆకులు, మొక్కలు, వృక్షాలను ఆహారంగా తీసుకునేవి.
> **ఉదా:** బ్రాకియోసారస్, డిప్లోడోకస్, ట్రైసెరాటాప్స్
> **మాంసాహార డైనోసార్లు:**
> ఇతర జంతువులను వేటాడి ఆహారంగా తీసుకునేవి
> **ఉదా:** టైరానోసారస్‌రెక్స్,వెలోసిరాప్టర్,అల్లోసారస్
> **మొత్తం గుర్తించిన జాతులు :**
> ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా వెయ్యికి పైగా డైనోసార్ జాతులు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొత్త శిలాజాల పరిశోధనతో ఈ సంఖ్య మరింత పెరుగుతోంది.







## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆస్పత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేయాలన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీ వేంనరేందర్?రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 22ఏ భూ సమస్యల పరిష్కారం దిశగా మరో కీలక నిర్ణయం

ఏర్పాటు చేసింది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉన్న 22ఏ ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి మంజూరు చేసింది. కొని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేసింది.

## డిజిటల్ వేదికగా సత్యాగ్రహను ప్రారంభించిన రాహుల్

నేతగా తన బాధ్యతని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఎక్కడ నిరసన చేపట్టినా వాటిని ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రజలకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. "దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. అయితే, వారంతా ఒంటరిగానే పోరాడుతున్నారు. జెన్‌జీ (ఉవని జి), విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరూ చేస్తున్న పోరాటాల వెనుక ఓ కారణం ఉంటుంది. ఒంటరిగా పోరాడుతున్నందు వల్ల ప్రభుత్వం వారి గళాన్ని అణచివేస్తోంది. ఆ గళాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నమే ఈ 'సత్యాగ్రహ'. సత్యమే మన గొప్ప ఆయుధమని బాపూజీ మనకు బోధించారు. కానీ సత్యం పక్షాన నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధం. మీరు కూడా ఏదైనా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే, మీ కథనాన్ని పంచుకోండి. అండగా నిలవడానికి నా శక్తిమేర కృషి చేస్తాను. ప్రతిపక్ష నాయకుడిగా అది నా బాధ్యత. మీ సత్యాగ్రహ కథనాన్ని నాకు తెలియజేయండి. దేశం మొత్తం మీ పోరాటాల గురించి తెలుసుకుంటుంది. మద్దతుగా నిలుస్తుంది." అని రాహుల్ గాంధీ ప్రజలను కోరారు.

## పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు ఆకర్షించేలా ప్రాజెక్టులు

పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాజెక్టులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గతేడాది గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక రంగంలో సుమారు రూ. 30 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డిసెంబరులో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌లో దేశ, విదేశీ పెట్టుబడిదారులకు తెలంగాణ పర్యాటక రంగంలోని అవకాశాలను సమగ్రంగా ప్రదర్శించేందుకు సుమారు 80 ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సీఎస్‌కు సూచించారు. చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పీపీపీ విధానంలో రూ.11 కోట్లతో టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మూడు జిల్లాల్లో కారవాన్ పార్కుల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## అన్ని రాష్ట్రాల అసెంబ్లీతో సహా..

# లోక్‌సభను రద్దు చేయండి

- ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే
- తిరిగి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో మళ్లీ నిర్వహించాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన డిమాండ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన- దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని



నరేంద్ర మోదీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.

## అదరగొట్టారు..

భారత్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన టీమ్ఇండియా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. హసన్ నవాజ్ (96) పోరాడినా పాక్‌కు ఓటమి తప్పలేదు. దీంతో ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణం, పాకిస్థాన్ రజతం, శ్రీలంక కాంస్య పతకాలను అందుకొన్నాయి. మూడో స్థానం కోసం పోటీలో బంగ్లాదేశ్‌ను శ్రీలంక ఓడించింది.

**పోటీ ఇచ్చినా..**

అసలే జపాన్ పిచ్.. ఇక్కడ 170+ లక్ష్యమంటే అతిపెద్ద సవాల్. ఇక భారత్ 212 పరుగులను నిర్దేశించింది. దీంతో టీమ్ఇండియా అలవోకగా గెలిచేస్తుందని అంతా భావించారు. అందుకు తగినట్టుగానే ఆరంభంలో మన బౌలర్లు అదరగొట్టారు. కానీ, పాక్ బ్యాటర్ నవాజ్ మాత్రం పట్టువిడవలేదు. చివరి వరకూ క్రీజ్‌లో ఉండి తన జట్టును గెలిపించేందుకు ప్రయత్నించాడు. అతడికి సైమ్ అయూబ్ (29), మజ్ సదాఖత్ (23) సహకారం అందించారు. అయితే, కీలక సమయంలో భారత బౌలర్లు వికెట్లు తీసి పాక్‌పై ఒత్తిడి పెంచారు. ఓ వైపు వికెట్లు పడటం.. రన్‌రేట్‌కూడా పెరిగిపోవడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 2.. సుందర్, దూబే చెరో వికెట్ తీశారు.

అభిషేక్, తిలక్ సూపర్..

పిచ్ మందకొడిగా ఉండటంతో పాక్ తొలి నుంచి స్పిన్నర్లతోనే బౌలింగ్ ఎటాక్‌ను మొదలుపెట్టింది. 18 ఓవర్లను స్పిన్నర్లే వేయడం గమనార్హం. వైభవ్ సూర్యవంశీ (15)తో కలిసి భారత్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన అభిషేక్ (61: 28 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆరంభంలో ఆచితూచి ఆడాడు. ఓ వైపు వైభవ్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా.. అభిషేక్ మాత్రం తొందరపడలేదు. బంతిని సరిగ్గా అంచనా వేసి బౌండరీలు బాదాడు. స్వల్ప వ్యవధిలో వైభవ్‌తోపాటు సంజు (2) ఔటైనప్పటికీ ఆ ప్రభావం భారత్‌పై లేకుండా చేశాడు. శ్రేయస్ (21)తో కలిసి ఇన్నింగ్స్‌ను తీసుకెళ్లాడు. అభిషేక్ ఔటయ్యే సమయానికి భారత్ స్కోరు 93. ఆ తర్వాత టీమ్ఇండియా స్కోరు బోర్డు నెమ్మదించింది. పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఇషాన్ (20), శ్రేయస్ ఇబ్బంది పడ్డారు. దీంతో అసలు భారత్ స్కోరు కనీసం 160 పరుగులైనా దాటుతుందా? అనిపించింది. ఇక్కడే తెలుగు కుర్రాడు తిలక్ వర్మ చెలరేగాడు. దూబేతో (27)తో కలిసి బౌండరీల వర్షం కురిపించాడు. దీంతో చివరి ఐదు ఓవర్లలోనే భారత్ 74 పరుగులు రాబట్టింది. దీంతో టీమ్ఇండియా స్కోరు కూడా 210+ దాటేసింది. పాక్ బౌలర్లు అహ్మద్ 2, అరాఫత్ 2.. సైమ్, అబ్రార్ తలో వికెట్ తీశారు.

## హాకీలోనూ మనదే స్వర్ణం..

### అంతిమ్‌కు రజతం.. దీపక్‌కు కాంస్యం

ఆసియా క్రీడల్లో భారత్ పురుషుల హాకీ జట్టు స్వర్ణం సాధించింది. ఇవాళ భారత్ ఖాతాలో నాలుగు బంగారు పతకాలు చేరాయి. దీంతో మెడల్స్ పట్టికలో టీమ్ఇండియా 85 పతకాలతో నాలుగో స్థానానికి చేరుకుంది. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు ఉన్నాయి. దీంతో ఆసియా క్రీడలు 2026 ఎడిషన్‌లో భారత్ ప్రయాణం దాదాపు ముగిసింది. మలేసియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 5-1 తేడాతో విజయం సాధించింది. ఆరంభం నుంచి ఇరు జట్లూ గోల్స్ కోసం పోటీ పడ్డాయి. 11వ నిమిషంలోనే భారత్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. అయితే, 14వ నిమిషంలో మలేసియా గోల్ సాధించి సమం చేసింది. మళ్లీ 23వ నిమిషంలో భారత్ తరఫున లక్రా గోల్ కొట్టాడు. అక్కడ నుంచి మలేసియాకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారత ప్లేయర్లు విజృంభించారు. రెండో హాఫ్‌లో మరింత దూకుడుగా ఆడారు. మొత్తం ఐదు గోల్స్ చేసి విజయం ఖాయం చేసుకుని బంగారు పతకం సాధించారు. దీంతో ఒకే ఎడిషన్‌లో మహిళల, పురుషుల విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించడం ఇదే తొలిసారి. మహిళల 53 కేజీల విభాగంలో రెజ్లర్ అంతిమ్ పంఘాల్ ఫైనల్‌లో ఓడిపోయింది. దీంతో రజతంతో సరిపెట్టుకుంది. ఇక 97 కేజీల పురుషుల రెజ్లింగ్‌లో దీపక్ పునియాకు కాంస్యం దక్కింది.

చైనానే టాప్.. కానీ

ఆసియా క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన దేశంగా చైనా నిలిచింది. 167 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలు ఉన్నాయి. మొత్తం 339 పతకాలను సాధించింది. గత ఎడిషన్‌తో పోలిస్తే చైనా పతకాలు తగ్గాయి. 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో 383 పతకాలను అప్పుడు చైనా సొంతం చేసుకుంది. ఇక ఈసారి ఆతిథ్య జపాన్ గతం కంటే చాలా మెరుగ్గా పతకాలను సాధించడం గమనార్హం. 2022లో 188 సాధించగా.. ఈసారి 265 పతకాలకు చేరుకుంది. కొరియాకి కూడా 190 నుంచి 149కి తగ్గిపోయాయి. భారత్ గత ఎడిషన్‌లో 107 రాగా.. ఈసారి 85 పతకాలు మాత్రమే వచ్చాయి.

## ఎల్‌నినోను కాంగ్రెస్ ఎదుర్కోలేకపోయింది

చలించిపోయారు. స్థానిక నాయకురాలు సునీతా లక్ష్మారెడ్డితో కలిసి వెళ్తుండగా మార్గం మధ్యలో కరెంటు లేక ఎండిపోతున్న వరి పొలాలను చూసి పొలంలోకి వెళ్లి అక్కడున్న మహిళా రైతు నాగమణితో మాట్లాడి ఆమె కష్టాలను అడిగి తెలుసుకున్నారు. చిట్కోల్ల నాగమణి అనే ఆ మహిళా రైతు హరీశ్ రావు ముందు తన ఆవేదనను వెళ్లగక్కింది. బోర్లలో నీళ్లున్నా.. ప్రభుత్వ చేతకానితనం వల్ల కరెంటు రాక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని వాపోయింది. సుమారు 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టి 3 ఎకరాల్లో వరి నాట్లు వేస్తే.. అందులో సగం పొలం పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. పంట పొట్టకొచ్చే దశలో నీళ్లు అత్యంత అవసరమని, సరిగ్గా ఈ సమయంలోనే కరెంటు లేక రైతుల బతుకులు ఆగం అవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో పగటిపూట నిరంతరాయంగా కరెంటు వచ్చేదని, ఎలాంటి రంది లేకుండా పంటలు పండించుకున్నామని నాగమ్మ గుర్తుచేసుకుంది.

## మనకు ఏఐ-ఆధారిత దళం ఉండాలి

### ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్‌కు ఐదోతరం అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ-57 అందించేందుకు రష్యా సిద్ధంగా ఉందని భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. వాటిని భారత్‌లోనే ఇరుదేశాలూ ఉమ్మడిగా ఉత్పత్తి చేసే అవకాశం కూడా ఉందని చెప్పారు. అయితే ఈ ప్రతిపాదనపై కేంద్రం నిర్ణ యం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌కు ఉన్న మొత్తం సైనిక బలంలో వైమానిక శక్తి కీలకమైనదని, కృత్రిమ మేధ సాయంతో దానిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఏఎఫ్‌ను ఆధునీకరించడం గురించి మాట్లాడుతూ.. భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు ఏఐ-ఆధారిత దళం ఉండాలని పేర్కొన్నారు. అనుకున్న విధంగా జరిగితే.. త్వరలో ఫ్రాన్స్‌తో మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఐఏఎఫ్ చీఫ్ తెలిపారు. 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు భారత్ ఫిబ్రవరిలో ఆమోదం తెలిపిందన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి తుది కసరత్తు

- జలాశయ పనులు దాదాపు 98 శాతం పూర్తి
- భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- అనుమతులు, కాలువల పనులకు గడువులతో కార్యాచరణ: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్(జనంసాక్షి):** గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి అడ్డుగా ఉన్న పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే భారీగా నిధులు వెచ్చించిన ఈ ప్రాజెక్టు ద్వారా 1.06 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన గౌరవెల్లిని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడంపై తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, న్యాయపరమైన వ్యవహారాలు చూసే అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉత్తమ్ సూచించారు. పనులవారీగా స్పష్టమైన గడువులు నిర్ణయించి, అర్హులైన వారికి చెల్లించాల్సిన పరిహారాన్ని త్వరగా చెల్లించాలని ఆదేశించారు. ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అడ్డంకులు ఏవైనా ఉంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి జలాశయం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి చేపట్టిన ఇందిరమ్మ వరద కాలువ పథకంలో భాగం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలనలో 2008 మేలో దీని నిర్మాణానికి తొలి ఒప్పందం కుదిరింది. అనంతరం జలాశయ సామర్థ్యాన్ని 1.410 టీఎంసీల నుంచి 8.230 టీఎంసీలకు పెంచారు. విస్తరించిన పనులకు సంబంధించి 2017 డిసెంబరులో అనుబంధ ఒప్పందం చేసుకున్నారు. అయితే అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు లేకపోవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. జలాశయ నిర్మాణ పనులు దాదాపు 98 శాతం పూర్తయ్యాయి. అయితే రైతులకు ఆశించిన మేర సాగునీరు అందాలంటే పర్యావరణ అనుమతితో పాటు మిగిలిన భూసేకరణ, పునరావాస బాధ్యతలు, కాలువల పనులను పూర్తి చేయాల్సి ఉంది. జలాశయం నిర్మాణం పూర్తయినంత మాత్రాన సరిపోదని, అక్కడి నుంచి రైతుల పొలాలకు నీటిని తీసుకెళ్లే ప్రధాన కాలువలు, పంపిణీ కాలువలు కూడా సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తగిన బడ్జెట్ కేటాయింపులు ఉన్నందున వాటిని సకాలంలో వినియోగించి పనుల్లో పురోగతి చూపాలని ఆదేశించారు.

## అనంతగిరి ఘాట్ రోడ్డులో ట్రావెల్స్ బస్సు బోల్తా..

### నలుగురి మృతి.. ఏడుగురికి గాయాలు

### ప్రమాదంపై సీఎం రేవంత్‌గ్భ్రాంతి

వికారాబాద్(జనంసాక్షి): వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతిచెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని కేసారం నుంచి వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం చింతకుంటకు 54 మంది ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వారంతా వెళ్లారు. ఈ క్రమంలో అనంతగిరి కొండ పైనుంచి కిందికి దిగే క్రమంలో ఘాట్ రోడ్డులో బస్సు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనాస్థలాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

**వయోభారంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

చెన్నై(జనంసాక్షి): ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు(94) కన్నుమూశారు. వయోభారంతో చెన్నై కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. చివరిగా నాగ్ అశ్విన్ నిర్మాణంలో 'సింగ్ గీతం' చిత్రానికి దర్శకత్వం వహించారు. 94 ఏళ్ల వయసులో దర్శకత్వం వహించి పలువురు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. పుష్పక విమానం, ఆదిత్య 369, భైరవద్వీపం, మయూరి, విచిత్ర సోదరులు తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. 1931 సెప్టెంబర్ 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ఆయన జన్మించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలలో చదువుకున్నారు. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ ఆధ్వర్యంలో నాటకాల్లోకి రంగ ప్రవేశం చేశారు. కళాశాల రోజుల్లోనే హాలీవుడ్ చిత్రాలపై మక్కువ పెంచుకున్నారు. డిగ్రీ తర్వాత సూళ్లూరుపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన స్వయంగా రచించిన నాటకాలు బ్రహ్మ, అంత్యఘట్టం. రవీంద్రనాథ్ ఠాగూర్ 'చిత్ర'ను 'చిత్రార్జున' నాటకంగా ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. 1960లో లక్ష్మీకల్యాణిని వివాహం చేసుకున్నారు. సినిమాల రచనలో శ్రీనివాసరావుకు ఆమె తోడుగా నిలిచారు. సతీమణి పేరుపై 'శ్రీకల్యాణీయం' పుస్తకం రాశారు. 2022లో అనారోగ్యంతో సింగీతం భార్య లక్ష్మీకల్యాణి మృతి చెందారు. తెలుగుతోపాటు పలు భాషల్లో సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. భారతీయ సినీ రంగంలో వినూత్న ప్రయోగాలకు చిరునామాగా మారారు.

# పెద్దపల్లి బీఆర్ఎస్‌లో గ్రూపుపోరు

- ఒకరిపై ఒకరు కుర్చీలతో దాడి
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సమావేశం రచ్చ



**పెద్దపల్లి, అక్టోబర్ 03 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆరఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్ఆర్ గార్డెన్ లో నిర్వహించిన నియోజకవర్గ బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో వర్గ పోరు బట్టబయలైంది. శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సమావేశానికి నియోజకవర్గానికి చెందిన బీసీ నాయకులు గంట రాములు యాదవ్, దాసరి ఉషలతో పాటు ఇతర నాయకులను ఆహ్వానించలేదని ఆగ్రహించిన బీసీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దాసరి మనోహర్ రెడ్డి వర్గానికి చెందిన కొంతమంది నాయకులు వారితో వాగ్వాదానికి దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కుర్చీలను విసిరేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింప చేసి పంపించారు. దాసరి మనోహర్ రెడ్డి ఒంటెద్దు పోకడల వల్ల నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా లేకుండా పోయే పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపించారు. ఓడిపోయినా కూడా బీసీల అభిమానాన్ని మాజీ ఎమ్మెల్యే పూర్తిగా దెబ్బతీస్తున్నాడని ఇలా చేస్తూ పోతే పార్టీ పూర్తిగా పెద్దపల్లి లో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కుట్టేదెప్పుడు.. ఇచ్చేదెప్పుడు?

- స్కూల్ యూనిఫాం పంపిణీలో జాప్యం
- నెలలు గడిచినా అందని రెండో జత దుస్తులు
- పాత బట్టలతోనే పాఠశాలలకు విద్యార్థులు



**వెంకటాపూర్ (రామప్ప)అక్టోబర్ 03 (జనం సాక్షి):** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ ఈ ఏడాది పూర్తిగా గాడి తప్పింది. విద్యా సంవత్సరం మొదలై నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు దుస్తులు కుట్టే పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. వెంకటాపూర్ మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందలేదు. కొన్ని స్కూళ్లలో మొక్కుబడిగా ఒక జత చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అందులోనూ కొలతల్లో తేడా ఉండటంతో ఆ ఒక్క జత కూడా విద్యార్థులకు ఉపయోగపడటం లేదు. కొలతలు తీసుకోవడంలో జరిగిన జాప్యం, కుట్టు పనులు నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాత, చినిగిన బట్టలతోనే బడికి వెళ్తున్నారు.

**డిజైన్ల మార్పుతో ఆలస్యమవుతున్న సరఫరా**

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం యూనిఫాం రంగులు, డిజైన్లలో మార్పులు చేసింది. బాలురకు లేత నీలం చొక్కా, ముదురు నీలం నిక్కరు లేదా ప్యాంటు, అదేవిధంగా బాలికలకు లేత నీలం టాప్, ముదురు నీలం బాటమ్, సల్వార్ కమీజ్ తో పాటు తరగతుల వారీగా వేస్ట్ కోట్లను అందించాలని నిర్ణయించింది. అయితే డిజైన్ ఖరారైనప్పటికీ, క్లాత్ సరఫరా ఆలస్యం కావడంతో పూర్తిస్థాయిలో యూనిఫాంలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళా సంఘాలకు వస్త్రాలను అందజేసినా, కుట్టు పనులు పూర్తయిన తర్వాత కూడా పాఠశాలలకు సకాలంలో చేరడం లేదు. అధికారులు మాత్రం రెండో జత దుస్తులు ఈ నెలాఖరులోగా పంపిణీ చేస్తామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ హామీ అమలుకు నోచుకోవడం లేదు.

**నాణ్యతలేమి కుట్లతో ఊడిపోతున్న గుండీలు**

ఇప్పటివరకు పంపిణీ చేసిన దుస్తుల నాణ్యత అధ్వాన్నంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుట్టు సరిగా లేకపోవడంతో గుండీలు ఊడిపోతున్నాయి. దుస్తుల కొలతలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మహిళా సంఘాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇస్తున్న రూ. 60 కూలీకి ఇలా కాకుండా ఇంకెలా కుడతారని సమాధానం ఇస్తుండటం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దసరా లోగా దుస్తుల పంపిణీ పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



# యువరైతును కాటేసిన కరెంటు

- పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మృతి



**మరిపెడ అక్టోబర్ 3 (జనం సాక్షి):** కరెంట్ యువరైతు పాలిట యమపాశమైంది. లో వోల్టేజ్ కరెంటు కారణంగా మోటార్ నడవక పొలానికి నీరు అందక, పొలాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించి విద్యుదాఘాతానికి గురై వ్యవసాయక్షేత్రంలోనే విగతజీవిగా మారాడు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గురప్పా తండా గ్రామ పంచాయతీలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రప్ప తండాకు చెందిన బానోతు మహేందర్(33) తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ భార్య ఇద్దరు పిల్లల్ని తో జీవనం సాగిస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తన పొలానికి నీరు పెట్టేందుకు శనివారం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు.

కాగా కొన్ని రోజులుగా తన పొలానికి అనుసంధానంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ పై హెవీ లోడ్ పడి మోటారు తరచు రిపేర్ రావడం, లోవోల్టేజీ ట్రాన్స్ ఫార్మర్ పై అధిక మోటార్లు ఉండటంతో కరెంటు సరఫరాలో సమస్యలు వస్తున్నాయి. దీంతో పొలానికి నీరదంక పంట ఎండిపోతుందని భావించి పక్కనే ఉన్న మరో ట్రాన్స్ ఫార్మర్ కు తన మోటార్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించాడు. ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మూడేళ్ల కుమారుడు, పదేళ్ల కుమార్తె ఉన్నారు.

# నల్లబెల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

- మండల సభలో సర్పంచుల ఏకగ్రీవ ప్రతిపాదన



**నల్లబెల్లి, అక్టోబరు 03 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో మండలంలో తక్కువ వర్షపాతం నమోదైనందున నల్లబెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానించి అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వార్షిక ప్రణాళికలను సభలో వివరించారు. విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, ఆర్టీసీ తదితర శాఖల అధికారుల ప్రణాళికలపై సర్పంచులు చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అర్షనపల్లి సర్పంచ్ సంతోష్, నల్లబెల్లి సర్పంచ్ జ్యోతి తెలిపారు. ముచ్చింపుల గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఇస్తారి శేఖర్ గౌడ్ విద్యుత్ ఏఈ కృష్ణకాంత్‌ను కోరారు. ముచ్చింపుల తండా గ్రామ పరిధిలోని డీబీఎం-38 సబ్‌కెనాల్ 17ఎల్ భూమి ఆక్రమణకు గురవుతోందని సర్పంచ్ రవీందర్‌గౌడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సబ్‌కెనాల్ భూమి హద్దులను గుర్తించాలని కోరారు. నర్సంపేట నుంచి ములుగు వెళ్లే ప్రయాణికుల కోసం మెరుగైన ఆర్టీసీ సౌకర్యాలు కల్పించాలని సర్పంచులు కోరారు. సాయంత్రం వేళ నర్సంపేట నుంచి మల్లంపల్లికి అదనపు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని, మండల కేంద్రం నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీఓ రవి, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు నీట్‌లో ఉచిత శిక్షణ

- రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ మైనా రిటీస్ రెసి డెన్షియల్ ఎడ్యు కేషనల్ ఇన్‌స్టి ట్యూషన్స్ సొసైటీ ఆధ్వ ర్యంలో నీట్-2027 ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న మైనారిటీ విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ లాంగ్‌టర్మ్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పోరేట్ కాలేజీలకు ధీటుగా నిష్ణాతులైన సిబ్బంది చేత ఉచిత శిక్షణతో పాటు బోర్డింగ్, ఇతర సదుపాయాలను కూడా అందించడం జరుగుతుందని అర్హులైన విద్యార్థులు తమ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, నీట్-2026 ర్యాంక్ కార్డు లేదా స్కోర్ కార్డును స్కాన్ చేసి ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలురు: tsrjclbnagar@gmail.com, బాలికలు: acadtmrjcboysbarkas@gmail.com కు దరఖాస్తులు నవంబర్ 1లోపు సమర్పించాలని తెలిపారు. మైనారిటీ విధ్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యాకూబ్ పాషా కోరారు. ఇతర వివరాలకు 8520860785 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

# 250 మెట్రిక్ టన్నుల గోడౌన్ ప్రారంభం

- సహకార సంఘాల సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**సంగం మండలం, అక్టోబర్ 03( జనం సాక్షి) :** సంగెం మండలంలో సహకార సంఘాలు, మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామచంద్రపురం గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్‌ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పాలక మండలి సభ్యులు చక్కగా పనిచేస్తున్నారని అభినందించారు. సొసైటీ ద్వారా సభ్యులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా సభ్యుల ఆర్థిక అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని కోరారు. మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పాల ఉత్పత్తి, పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, సొసైటీ సభ్యులు ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్విని యోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో సహకార రంగం అభివృద్ధికి, వివిధ కార్యక్రమాల అమలుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో ఎస్ఈఆర్‌పి, టిఆర్‌డిఏ, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వి బి జి రాంజీ గ్రాంట్ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జిల్లా సహకార అధికారి నీరజ , జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్ ,సంగెం తహసిల్దార్ రాజకుమార్, మండల అభివృద్ధి అధికారి రమేష్ అధికారులు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సొసైటీ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల కోసం కెత్తెర కదిలింది

- ఆర్టీసీ కార్మికుల గొంతుకగా బహుజన వర్కర్స్ యూనియన్ తో టిఆర్పీ
- కరీంనగర్ వన్ డిపో,టూ డిపో,హుజురాబాద్ డిపోలో టిఆర్పీ ప్రచారం
- కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు
- టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం బహుజన వర్కర్స్ యూనియన్‌కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టిఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ తీన్మార్ మల్లన్న గారి సూచన మేరకు ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బహుజన వర్కర్స్ యూనియన్‌కు మద్దతుగా కరీంనగర్ జిల్లాలో పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బహుజన వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కుమార్ కురుమ గారి ఆధ్వర్యంలో జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కంసారపు కోమల, రామచంద్రం బృందంతో కలిసి టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా గారి ఆధ్వర్యంలో కరీంనగర్ వన్ డిపో, టూ డిపోలలో ప్రచారం నిర్వహించారు. హుజురాబాద్ డిపోలో జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు తెరిగమల్ల నాగార్జున ఆధ్వర్యంలో టిఆర్పీ నాయకులు కార్మికులను కలిసి బహుజన వర్కర్స్ యూనియన్‌కు మద్దతు కోరారు. ఈ సందర్భంగా బహుజన వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కుమార్ కురుమ, టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మీడియా తో మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కేవలం ఎన్నికల సమయంలో ప్రస్తావించి వదిలేయకుండా, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడే యూనియన్ అవసరమని అన్నారు. ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ ప్రయోజనాలు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీల్లో పనిచేస్తున్న మెకానిక్స్, మెస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బహుజన వర్కర్స్ యూనియన్ ప్రకటించిన 26 హామీలను ఎన్నికల్లో గెలిచిన ఆరు నెలల్లోపు అమలు చేయకపోతే యూనియన్‌ను రద్దు చేసుకుంటామని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జవాబుదారీతనం ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ విధమైన స్పష్టమైన హామీని ప్రకటించామని పేర్కొన్నారు. బహుజన వర్కర్స్ యూనియన్ ఎన్నికల గుర్తు కెత్తెర అని, ఆర్టీసీ కార్మికులు తమ అమూల్యమైన ఓటును కెత్తెర గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని టిఆర్పీ నాయకులు కోరారు. కార్మికుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా, హక్కుల కోసం పోరాడే సంఘంగా బహుజన వర్కర్స్ యూనియన్‌ను బలోపేతం చేయాలని, ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు కోసం ఐక్యంగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహ్మద్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, కొత్తపెల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు, నాయకులు మావురపు కనకయ్య, నేదునూరి కుమార్, రాజు, మాదం ఐలయ్య, సురేష్ పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, అక్టోబర్ 03 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి లు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో నియోజకవర్గ అభివృద్ధి. సంక్షేమ కార్యక్రమాలపై చర్చించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని మంత్రికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. ఝాన్సీ రెడ్డి లు వినతిపత్రం అందించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం. అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ వారిని కోరినట్లు తెలిపారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 03 (జనం సాక్షి) :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించే ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ కేంద్రాలపై నోటీసులు జారీ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, నిబంధనల అమలుపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి నివేదిక సమర్పించారు. కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. నిబంధనలు పాటిస్తున్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయగా, ఫైర్ సేఫ్టీ తదితర అంశాల్లో లోపాలు ఉన్న సంస్థలకు వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఆసుపత్రులు, క్లినిక్స్‌లో వైద్యులు, సిబ్బంది, రిజిస్ట్రేషన్ వివరాలు, అందించే వైద్య సేవలు, ఫీజుల వివరాలను రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని అధికారులు సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్, డీసీపీ కవిత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ వెంకటస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజమౌళి, ఫైర్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్
- జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలన



**ములుగు ప్రతినిధి, అక్టోబర్03(జనం సాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం గోవిందరావుపేట మండలం బుస్సాపూర్, తాడ్వాయి మండలం మేడారం, వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామపంచాయతీల పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సకాలంలో ఖాతాల్లో జమ అవుతోందా అని ఆరా తీశారు. ఆర్థిక సాయం సకాలంలో అందుతోందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని లబ్ధిదారులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ,రెండవ విడతలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బిల్లుల మంజూరు విషయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూడాలని అధికారు లను ఆదేశించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించవద్దని,అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి,ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురా వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, హౌసింగ్ పి.డి.కృష్ణ ప్రసాద్, స్థానిక తహసీల్దార్లు,హౌసింగ్ శాఖ ఏఈ లు,ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరసన నేరం కాదు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ముంబయిలో జరిగిన ఆందోళనపై పోలీసులు 400--500 మంది గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నప్పే చర్య కాదు. ఓటర్ల జాబితా సవరణ తీరుపై అభ్యంతరాలతో విపక్ష నేతలు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు శివాజీ పార్క్ వద్ద గళమెత్తారు. షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా వంటి సీనియర్ కళాకారులూ ఇందులో పాల్గొన్నారు. అనుమతి లేదనే సాంకేతిక కారణంతో వందలాది మందిపై కేసులు పెట్టడం అతి స్పందనే అవుతుంది.

సంపాదకీయం

శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. ప్రజాభద్రత, శాంతిభద్రతల దృష్ట్యా సహేతుక పరిమితులు విధించవచ్చు. కానీ ఆ పరిమితులు నిరసనను అణచడానికి ఆయుధంగా మారకూడదు. హింస జరిగిందని, ఆస్తి నష్టం జరిగిందని ఆధారాలు లేనప్పుడు, అనుమతి లేదన్న కారణంతో గుర్తు తెలియని వందలాది మందిపై కేసులు పెట్టడం భయపెట్టే చర్యగానే కనిపిస్తుంది. ముఖ్యంగా విద్యార్థులు, యువతపై క్రిమినల్ కేసులు బనాయిస్తే వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. ప్రశ్నించే తత్వాన్ని అణచివేసినట్ల వుతుంది. ప్రజాస్వామ్యంలో పౌరుల పాత్ర ఐదేళ్లకోసారి ఓటు వేయడంతో ముగిసిపోదు. పొలిటికల్ సైన్స్ చెప్పేదీ అదే: పాలనా వ్యవహారాల్లో పౌరుల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ఆధునిక రాజ్యం రూపుదిద్దుకుంటుంది. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరుపై సందేహాలు తలెత్తినప్పుడు వాటిని ప్రశ్నించడం పౌరుల హక్కు, బాధ్యత కూడా. ఆ సంస్థల విశ్వసనీయత నిలవాలంటే విమర్శను ఓర్పుతో వినాలి, ఆరోపణలకు పారదర్శకంగా సమాధానం చెప్పాలి.

ప్రశ్నలకు సమాధానంగా పోలీసు కేసులు, జైలు బెదిరింపులు ఎదురైతే వ్యవస్థ మరింత అపనమ్మకంలోకి జారుతుంది. అణచివేత ఎంత పెరిగితే అసంతృప్తి అంత లోతుగా పాతుకుపోతుంది. అది చివరికి నియంత్రించలేని ప్రజా ఆగ్రహంగా మారవచ్చు. ప్రభుత్వాలు, పాలనా సంస్థలు విమర్శను శత్రుత్వంగా చూడకుండా ప్రజాస్వామ్యానికి అవసరమైన ఔషధంగా భావించాలి. నమోదు చేసిన కేసులను పునఃసమీక్షించి, శాంతియుత నిరసనకారులపై చర్యలను ఉపసంహరించుకోవడమే సరైన మార్గం.

# రుణాల ఊబిలో తెలంగాణ




తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఇప్పుడు కనిపిస్తున్న ప్రధాన ప్రశ్న ప్రభుత్వం ఎంత అప్పు తీసుకుంటోంది అనేది మాత్రమే కాదు; తీసుకుంటున్న అప్పు రాష్ట్ర భవిష్యత్ ఆదాయ సామర్థ్యాన్ని ఎంతవరకు దెబ్బతీస్తోంది అన్నదే అసలు ప్రశ్న. 2026-27 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 15 నాటికే రూ.46,400 కోట్ల నికర రుణ సమీకరణ జరిగిందని, అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో మరో రూ.13,000 కోట్లు సమీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని ఆర్బీఐ ఇచ్చిన గణాంకాలు చెబుతున్నాయి. దీనికి తోడు అక్టోబర్ 7న రూ.2,500 కోట్ల సెక్యూరిటీ బాండ్ల ద్వారా రుణం తీసుకునే ప్రతిపాదన ఉంది. అంటే ఆర్థిక సంవత్సరం పూర్తికాకముందే అప్పుల వేగం గణనీయంగా పెరుగుతున్నది.
అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన తేడాను గుర్తించాలి. రూ.58,458.71 కోట్లను ప్రభుత్వం 2026-27లో ఫిస్కల్ డెఫిసిట్ లక్ష్యంగా బడ్జెట్‌లో చూపించింది. ఇది కేవలం మార్కెట్ రుణ పరిమితి అని భావించడం సరైంది కాదు. అయినప్పటికీ ప్రభుత్వం బడ్జెట్ అంచనాల ప్రకారం 2026-27లో ఓపెన్ మార్కెట్ రుణాలుగా రూ.73,383.60 కోట్లు సమీకరించాలని ప్రతిపాదించింది. మొత్తం పబ్లిక్ డెట్ సంబంధిత రసీదులు రూ.79,983.60 కోట్లుగా ఉన్నాయి. కాబట్టి అప్పుల నిర్వహణను ఒకే సంఖ్యతో కొలవడం కాకుండా మొత్తం రుణ నిర్మాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.
ఇప్పటికే తెలంగాణ బడ్జెట్ పత్రం చూపిస్తున్న మరో విషయం మరింత ఆందోళన కలిగించేది. 2026-27 ముగిసే నాటికి రాష్ట్ర పబ్లిక్ డెట్ ఔట్‌స్టాండింగ్ రూ.5,62,363 కోట్లకు చేరుతుందని అంచనా. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో 29 శాతంగా ఉంటుంది. 2023--24లో రూ.3,98,655 కోట్లుగా ఉన్న ఈ మొత్తం 2024-25లో రూ.4,47,493 కోట్లకు, 2025-26 సవరించిన అంచనాలో రూ.5,03,905 కోట్లకు పెరిగింది. అంటే అప్పు పరిమాణం నిరంతరం పైకి కదులుతున్నది.
అప్పు తీసుకోవడం స్వతహాగా తప్పు కాదు. అభివృద్ధి ప్రాజెక్టులకు, మౌలిక వసతులకు, భవిష్యత్ ఆదాయాన్ని పెంచే పెట్టుబడులకు అప్పు ఉపయోగపడితే అది ఆర్థిక సాధనంగా మారుతుంది. కానీ రోజువారీ వ్యయాలను భరించడానికి అప్పులపై ఆధారపడటం ప్రారంభమైతే సమస్య తీవ్రమవుతుంది. తెలంగాణ 2026--27 బడ్జెట్‌లో రెవెన్యూ రసీదులు రూ.2,41,263.58 కోట్లు కాగా రెవెన్యూ వ్యయం రూ.2,34,405.82 కోట్లుగా అంచనా వేసింది. అంటే రూ.6,857.76 కోట్ల రెవెన్యూ మిగులు చూపిస్తోంది. ఇది కొంత ఊరటనిచ్చే అంశమే. కానీ అదే సమయంలో వడ్డీ చెల్లింపులకు రూ.21,304.39 కోట్లు కేటాయించాల్సి వస్తోంది.

ఇంకా విస్తృతమైన ఆర్థిక బాధ్యతలను విస్మరించకూడదు. 2026 ఫిబ్రవరి 28 నాటికి ప్రభుత్వ గ్యారంటీల కింద ఉన్న మొత్తం బాధ్యతలు రూ.3,01,835 కోట్లుగా బడ్జెట్ పత్రం పేర్కొంది. అందులో ప్రభుత్వం సేవ చేయాల్సిన ఎస్‌పీవీల రుణాలు మాత్రమే రూ.86,309 కోట్లు. ఇవన్నీ తక్షణ ప్రభుత్వ అప్పులుగా లెక్కించకపోయినా, భవిష్యత్తులో ప్రభుత్వ ఖజానాపై పడగల ఆర్థిక బాధ్యతలుగా చూడాల్సిందే.

అందువల్ల ప్రభుత్వం “అప్పు తీసుకున్నాం కాబట్టి తప్పు” అనే విపక్షాల సాధారణ వాదనకూ, “బడ్జెట్‌లో లోటు పరిమితిలోనే ఉంది కాబట్టి సమస్య లేదు” అనే మరో సరళమైన వాదనకూ మధ్యలో ఉన్న అసలు ఆర్థిక వాస్తవాన్ని ప్రజలకు వివరించాలి. ప్రతి కొత్త రుణానికి దాని వినియోగం, దాని ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనం, తిరిగి చెల్లించే సామర్థ్యం స్పష్టంగా వెల్లడించాలి. రుణంతో సృష్టించే ఆస్తి భవిష్యత్ ఆదాయాన్ని పెంచుతుందా, లేక ప్రస్తుత రాజకీయ-సామాజిక వ్యయాన్ని మాత్రమే నెట్టుకొస్తుందా అన్నది బడ్జెట్ చర్చలో ప్రధాన ప్రశ్న కావాలి.
తెలంగాణకు ప్రస్తుతం అవసరమైంది అప్పులను ఆపడం మాత్రమే కాదు; అప్పులపై ఆధారపడే ఆర్థిక విధానాన్ని క్రమంగా తగ్గించడం. పన్ను ఆదాయాన్ని విస్తరించడం, లీకేజీలను అరికట్టడం, ప్రభుత్వ సంస్థల పనితీరును మెరుగుపరచడం, మూలధన వ్యయానికి ప్రాధాన్యం ఇవ్వడం, గ్యారంటీ రుణాలపై కఠినమైన పారదర్శకత పాటించడం అవసరం. ప్రభుత్వం ఆదాయం పెంచే సామర్థ్యాన్ని పెంచకుండా అప్పుల పరిమాణాన్ని పెంచుకుంటూ పోతే, ఈ రోజు తీసుకున్న రుణం రేపటి అభివృద్ధి బడ్జెట్‌ను కుదించే ప్రమాదం ఉంది. ప్రజలకు సంక్షేమం కావాలి; రాష్ట్రానికి అభివృద్ధి కావాలి. కానీ రెండింటికీ పునాది బలమైన ఆర్థిక వ్యవస్థే. అప్పు ఆ పునాదికి సాధనం కావాలి గానీ, పునాదిగా మారకూడదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## విరసం నిత్య సమకాలీనం..

వొల్లం తండ్రీ మామొల్లం
రెక్టర్ స్కేలుకందలేమని..
తెగేసి చెప్పే తకరార్లనెల్లా
రెట్ట పట్టుకు లాక్కొనొచ్చి..

సొంత పుర్రెల భద్రంగా
పాతి పెట్టుకున్న దంతా..
ఏమేమో యాది జేసుకోని
ఏడేడనో ఎదుర్కొచ్చిందల్లా..

ఉద్నాడ్సి కుప్పేసుకోని
కూడేసుకున్న గసినంతా..
యాడాదికోతూరి ఠంచన్గా
కిందమీదా గెల్కిగెల్కి గీరి..

సాంపి జల్లుడు బీమారి
వాని కున్న రోగమేగాని..
విక్రీపతాక రెపరెపంటాని
వొడి పట్టినోడూ ఊరలంగే..

సుత్తీ కొడవలి కలం కలిసి
ఎగిరే పతాక దోషం ఎట్లవ్..
సాగే దారిల సాగిల బడలే
రాజ్య హింసకు బెద్రినదేడ..

శత్రువు గుండెకు సూటిగా
గురిపెట్టే సంధి కాలమున..
గురి చేరిపే ఎత్తుల మరిగి
ముర్గిన వాదాల్రేపే కంపిది..

మార్పు ప్రకృతి గుణమని
అది తనకెంతో ప్రాణమని..!
తన్నుతానే పుటంబెట్కొనే
విరసం నిత్య సమకాలీనం..!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# పంట ధర పెరుగుతున్నదా? రైతు ఆదాయం పెరుగుతున్నదా?

రైతు పండించే పంటకు ధర నిర్ణయించేటప్పుడు మార్కెట్‌లో కనిపించే ఒక క్వింటాలు ధాన్యం ధరను మాత్రమే చూడటం సరిపోదు. ఆ ఒక్క క్వింటాలు రైతు చేతికి రావడానికి ముందు విత్తనం నుంచి ఎరువు వరకు, దున్నడం నుంచి విత్తడం వరకు, కలుపు తీయడం నుంచి మందులు పిచికారీ చేయడం వరకు, నీటిపారుదల నుంచి కోత వరకు, రవాణా నుంచి మార్కెట్ వరకు ఎన్నో ఖర్చులు రైతు భరించాల్సి ఉంటుంది. అందుకే రైతు సమస్యను పంట ధరతో మాత్రమే కాకుండా ‘పంట ధర - సాగు వ్యయం - రైతు నికర ఆదాయం’ అనే మూడు అంశాల సమీకరణంలో చూడాల్సిన అవసరం ఉంది.
మూడు దశాబ్దాల క్రితం వ్యవసాయం చేసిన రైతు ఎదుర్కొన్న ఖర్చులు, 2026లో వ్యవసాయం చేస్తున్న రైతు ఎదుర్కొంటున్న ఖర్చులు ఒకే స్థాయిలో లేవు. 1998--99లో సాధారణ వరి కనీస మద్దతు ధర క్వింటాలకు రూ.440 ఉండగా, 2004--05 నాటికి అది రూ.560కి చేరింది. 2015--16లో రూ.1,410గా ఉన్న సాధారణ వరి కనీస మద్దతు ధర 2025--26లో రూ.2,369కి చేరింది. అంటే 2015--16తో పోలిస్తే దాదాపు 68 శాతం పెరిగింది. అదే సమయంలో పత్తి మధ్యస్థ నార రకం కనీస మద్దతు ధర 2015--16లో రూ.3,800 నుంచి 2025--26లో రూ.7,710కు చేరింది. కందులు రూ.4,625 నుంచి రూ.8,000కు, పెసలు రూ.4,850 నుంచి రూ.8,768కు, మినుములు రూ.4,625 నుంచి రూ.7,800కు పెరిగాయి. కాబట్టి ‘పంటలకు ధర అసలు పెరగలేదు’ అనడం గణాంకపరంగా పూర్తిగా సరైనది కాదు. కానీ రైతు సమస్య అక్కడితో ముగియదు. ధర పెరిగిన దానికంటే సాగు చేయడానికి అవసరమైన మొత్తం వ్యయం ఎంత పెరిగింది అన్నదే అసలు ప్రశ్న.
2015-16 నుంచి 2025-26 వరకు వరి కనీస మద్దతు ధర సుమారు 68 శాతం పెరిగినప్పటికీ, రైతు వ్యవసాయ ఖర్చులో కేవలం ఎరువుల ధరనే కాకుండా కూలి, డీజిల్, యంత్రాల అద్దె, విత్తనాలు, పురుగుమందులు, విద్యుత్, నీటిపారుదల, రవాణా, భూమి అద్దె వంటి అంశాలన్నీ చేరుతాయి. కేంద్ర వ్యవసాయ శాఖ లెక్కించే ఉత్పత్తి వ్యయంలో కూలి, యంత్రాల పని, అద్దె భూమి, విత్తనాలు, ఎరువులు, నీటిపారుదల, వ్యవసాయ పరికరాల తరుగుదల, పని మూలధనంపై వడ్డీ, డీజిల్ లేదా విద్యుత్ వంటి అంశాలు కూడా పరిగణనలోకి వస్తాయి.
ఇక్కడే రైతు ఆర్థిక సంక్షోభం అసలు రూపం కనిపిస్తుంది. మార్కెట్‌లో బియ్యం, పప్పులు, నూనెగింజలు, పత్తి, మిరప వంటి వ్యవసాయ ఉత్పత్తుల ధర పెరిగినప్పుడు వినియోగదారుడు అధిక ధర చెల్లిస్తున్నా, ఆ అదనపు రూపాయి మొత్తం రైతు చేతికి చేరడం లేదు. రైతు పండించిన పంటకు లభించే ధర, వినియోగదారుడు చెల్లించే తుది ధర మధ్య సరఫరా గొలుసులో అనేక దశలు ఉన్నాయి. రైతు మాత్రం విత్తనాలు, ఎరువులు, డీజిల్, యంత్రాలు అన్నీ ముందుగానే నగదు చెల్లించి కొనుగోలు చేసి, పంట చేతికి వచ్చిన తరువాత మార్కెట్ పరిస్థితులకు లోబడి విక్రయించాల్సి వస్తోంది. 2025-26లో సాధారణ వరి కనీస మద్దతు ధర రూ.2,369గా ఉంది. 2015-16లో అది రూ.1,410 మాత్రమే. అంటే క్వింటాలకు రూ.959 పెరుగుదల కనిపిస్తోంది. అయితే ఒక ఎకరా సాగులో దిగుబడి ఎంత వచ్చింది? ఆ దిగుబడికి మొత్తం ఖర్చు ఎంత అయింది? రైతు కుటుంబ శ్రమకు విలువ ఎంత లెక్కించారు? భూమి అద్దెను పరిగణనలోకి తీసుకున్నారా? అప్పుపై చెల్లించిన వడ్డీ ఎంత? కోత సమయంలో యంత్రాల అద్దె ఎంత? పంటను మార్కెట్‌కు తరలించడానికి రవాణా ఖర్చు ఎంత? ఇవన్నీ తీసివేసిన తరువాత రైతు చేతిలో మిగిలే నికర ఆదాయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానం లేకుండా ‘ఎంఎస్‌పీ పెరిగింది’ అని చెప్పడం రైతు వాస్తవ జీవితాన్ని పూర్తిగా వివరించదు.
ప్రభుత్వం 2018-19 నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సగటు ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం మార్జిన్ ఉండేలా కనీస మద్దతు ధర నిర్ణయించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతోంది. 2026--27 రబీ సీజన్‌కు గోధుమ కనీస మద్దతు ధర రూ.2,585, శనగ రూ.5,875, మసూర్ రూ.7,000, ఆవాలు రూ.6,200గా నిర్ణయించబడ్డాయి. గోధుమకు ప్రభుత్వం పేర్కొన్న ఉత్పత్తి వ్యయం క్వింటాలకు రూ.1,239 కాగా, ప్రకటించిన కనీస మద్దతు ధర దానిపై 109 శాతం మార్జిన్ చూపుతోంది.
కానీ దేశవ్యాప్తంగా ప్రతి రైతు తన పంటను ప్రకటించిన కనీస మద్దతు ధరకు విక్రయిస్తున్నాడా అనేది మరో ముఖ్యమైన ప్రశ్న. ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, మార్కెట్‌కు దూరం, పంట రకం, నాణ్యత, స్థానిక డిమాండ్, మధ్యవర్తుల పాత్ర, నిల్వ సదుపాయాలు వంటి అంశాలు రైతు వాస్తవ విక్రయ ధరను ప్రభావితం చేస్తాయి.



అందుకే కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, రైతుకు ఆ ధరకు లేదా దానికి సమీపంలో విక్రయించే అవకాశం కల్పించడం కీలకం.
వ్యవసాయంలో ‘ధర’ కంటే ‘ధరల స్థిరత్వం’ మరింత ముఖ్యమైన అంశంగా మారింది. ఒక సంవత్సరం పత్తికి మంచి ధర వస్తే తరువాతి సంవత్సరం ధర పడిపోవచ్చు. టమాటా, మిర్చి, ఉల్లి, పసుపు వంటి పంటల్లో కూడా ధరల తీవ్ర హెచ్చుతగ్గులు రైతును అప్పుల వైపు నెట్టే పరిస్థితులు సృష్టిస్తాయి. పంట బాగా పండితే ధర పడిపోవడం, పంట తగ్గితే ధర పెరగడం అనే విరుద్ధ పరిస్థితి రైతుకు శాశ్వత ఆదాయ భద్రతను ఇవ్వదు.
ఇక ఇన్‌పుట్ ధరల విషయానికి వస్తే రైతు కొనుగోలు చేసే ప్రతి వస్తువులో మార్కెట్ ధరల ప్రభావం కనిపిస్తోంది. డీజిల్ ధర పెరిగితే ట్రాక్టర్ దున్నింపు ఖర్చు పెరుగుతుంది. డీజిల్ ఆధారిత నీటిపారుదల ఖర్చు పెరుగుతుంది. పంటను మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చు పెరుగుతుంది. యంత్రాల ధరలు పెరిగితే యంత్రాల అద్దెలు పెరుగుతాయి. కూలి పెరిగితే కోత, కలుపు, పంట సంరక్షణ ఖర్చులు పెరుగుతాయి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ఖర్చు పెరిగితే రైతు పెట్టుబడి పెరుగుతుంది. ఫలితంగా పంట ధర కొంత పెరిగినా, రైతు నికర లాభం అదే స్థాయిలో పెరగకపోవచ్చు. దేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ‘ధరలు చెల్లించే సూచీ -- ధరలు పొందే సూచీ’ మధ్య సంబంధాన్ని పరిశీలించడానికి ప్రభుత్వ గణాంక వ్యవస్థలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల వాణిజ్య నిబంధనల సూచీ కూడా ఉంది. ఈ గణాంక వ్యవస్థ వ్యవసాయ రంగం కొనుగోలు చేసే వస్తువుల ధరలు, వ్యవసాయ ఉత్పత్తులకు లభించే ధరల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.
అందువల్ల రైతుకు కావలసింది కేవలం పంటకు ఎక్కువ ధర కాదు; ‘ఖర్చుకు తగిన ధర’ కావాలి. ఉదాహరణకు ఒక రైతు ఒక ఎకరా పంట కోసం రూ.30,000 ఖర్చు చేస్తే, పంట అమ్మకంతో రూ.32,000 వస్తే కాగితంపై రూ.2,000 లాభం కనిపించవచ్చు. కానీ రైతు కుటుంబ సభ్యుల శ్రమకు విలువ, భూమి అద్దె, అప్పుపై వడ్డీ, పంట నష్టం, మార్కెట్‌కు రవాణా వంటి అంశాలను చేరిస్తే ఆ లాభం మరింత తగ్గిపోవచ్చు. కాబట్టి రైతు ఆదాయాన్ని అంచనా వేయడానికి ‘పంట అమ్మకాల మొత్తం’ కాకుండా ‘అన్ని ఖర్చులు తీసివేసిన తరువాత మిగిలే నికర వ్యవసాయ ఆదాయం’నే ప్రధాన ప్రమాణంగా తీసుకోవాలి.
ఇక 2037 వైపు చూస్తే పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. 2026లో ఉన్న ధరలు 2037లో కూడా అలాగే ఉంటే రైతు ఆర్థికంగా మరింత వెనుకబడే ప్రమాదం ఉంటుంది. అయితే 2037కు ప్రభుత్వం అధికారికంగా ప్రతి పంటకు ఇప్పుడే ఒక నిర్దిష్ట కనీస మద్దతు ధరను ప్రకటించలేదు. అందువల్ల భవిష్యత్తు ధరలను ఖచ్చితమైన ప్రభుత్వ అంచనాలుగా చెప్పడం సరైంది కాదు. అయితే ఒక ఉదాహరణాత్మక లెక్కగా 2026 స్థాయి నుంచి సంవత్సరానికి 5 శాతం ధర పెరిగితే, 2037 నాటికి 11 సంవత్సరాల్లో ధర సుమారు 71 శాతం పెరుగుతుంది. అదే సంవత్సరానికి 7 శాతం చొప్పున పెరిగితే దాదాపు 110 శాతం పెరుగుతుంది.
ఈ 5 శాతం వార్షిక వృద్ధి కేవలం ఉదాహరణాత్మక అంచనా మాత్రమే. దాని ఆధారంగా 2026--27 స్థాయి నుంచి 2037కు చేరే క్వింటాలు ధరలను ఇలా ఊహించవచ్చు: సాధారణ వరి రూ.2,389 నుంచి సుమారు రూ.4,086, గోధుమ రూ.2,585 నుంచి రూ.4,421, మొక్కజొన్న రూ.2,400 నుంచి రూ.4,105, పత్తి పొడవైన నారు రకం రూ.8,110 నుంచి రూ.13,871, కంది రూ.8,000 నుంచి రూ.13,683, వేరుశనగ రూ.7,263 నుంచి రూ.12,422, సోయాబీన్ రూ.5,328 నుంచి రూ.9,113, శనగ రూ.5,875 నుంచి రూ.10,048, ఆవాలు రూ.6,200 నుంచి రూ.10,604 వరకు చేరవచ్చు. ఇవి ప్రభుత్వ భవిష్యత్ ధరల ప్రకటనలు కావు; సంవత్సరానికి 5 శాతం పెరుగుదల ఉంటే ఎలా ఉంటుందో చూపించే గణితపరమైన దృశ్య అంచనాలు మాత్రమే. ప్రస్తుత ఆధార ధరలు అధికారిక ఎంఎస్‌పీ గణాంకాల నుంచే తీసుకున్నవి.
అయితే అసలు ప్రశ్న 2037లో వరి క్వింటాలు రూ.4,000 అవుతుందా? కాదా? అనేది కాదు. 2037లో ఒక రైతు ఒక ఎకరా వరి సాగు చేయడానికి ఎంత ఖర్చు చేయాల్సి వస్తుంది? డీజిల్ ధర ఎంత ఉంటుంది? కూలి ఎంత ఉంటుంది? ఎరువుల ధర ఎంత ఉంటుంది? యంత్రాల అద్దె ఎంత ఉంటుంది? విత్తనాలు, పురుగుమందులు ఎంత ఖర్చవుతాయి? రైతు కుటుంబ శ్రమకు ఎంత విలువ ఇస్తాం? అన్నదే కీలకం.
రైతు ఆదాయాన్ని నిజంగా పెంచాలంటే ప్రతి సంవత్సరం పంట ధరను ప్రకటించే విధానంతో పాటు, ప్రతి పంటకు సమగ్ర సాగు వ్యయాన్ని శాస్త్రీయంగా లెక్కించాలి. పంట ధర నిర్ణయంలో విత్తనం, ఎరువు, కూలి, డీజిల్, విద్యుత్, యంత్రాలు, నీటిపారుదల, భూమి అద్దె, వడ్డీ, రవాణా, పంట నష్టం వంటి అంశాలను పారదర్శకంగా పరిగణనలోకి తీసుకోవాలి. రైతు పంటను నిల్వ చేసుకునే గిడ్డంగులు పెరగాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలి. పంటకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ పెంచాలి. రైతు నేరుగా మార్కెట్‌తో అనుసంధానం కావాలి. ధర పడిపోయినప్పుడు కనీస ఆదాయ రక్షణ కల్పించే వ్యవస్థ అవసరం.
వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు కేవలం ఒక రంగం కాదు. కోట్లాది కుటుంబాల జీవనాధారం. రైతు ఆదాయం పెరగకపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడదు. రైతు చేతిలో డబ్బు లేకపోతే గ్రామీణ మార్కెట్‌లో కొనుగోలు శక్తి తగ్గుతుంది. కొనుగోలు శక్తి తగ్గితే చిన్న వ్యాపారాలు, సేవారంగం, గ్రామీణ ఉపాధి కూడా ప్రభావితమవుతాయి. అందువల్ల రైతుకు న్యాయమైన పంట ధర ఇవ్వడం అనేది కేవలం రైతు సంక్షేమ కార్యక్రమం కాదు; దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే విధానం.
రైతు పండించిన ధాన్యానికి ధర నిర్ణయించేటప్పుడు అతని చెమటకు కూడా ధర ఉండాలి. రైతు పొలంలో పెట్టిన ప్రతి రూపాయి పెట్టుబడికి కనీస భద్రత ఉండాలి. మార్కెట్‌లో పంట ధర పెరిగినప్పుడు దాని ప్రయోజనం రైతుకు చేరాలి. ధర పడిపోయినప్పుడు నష్టాన్ని మొత్తం రైతు ఒంటరిగా భరించకూడదు. రైతు ఆదాయం, పంట ధర, సాగు వ్యయం మధ్య సమతుల్యత ఏర్పడినప్పుడే వ్యవసాయం నిలకడగా ఉంటుంది.
మూడు దశాబ్దాల వ్యవసాయ అనుభవం మనకు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. రైతుకు కేవలం ‘ధర పెంచుతాం’ అనే హామీ సరిపోదు. ‘రైతు పెట్టుబడి ఎంత? పంట ద్వారా వచ్చిన ఆదాయం ఎంత? చివరికి రైతు చేతిలో మిగిలింది ఎంత?’ అనే మూడు ప్రశ్నలకు ప్రతి పంట సీజన్‌లో సమాధానం చెప్పే వ్యవస్థ రావాలి. 2026 నుంచి 2037 వరకు వ్యవసాయ విధానాల ప్రధాన లక్ష్యం ఇదే కావాలి. పంటకు ధర ఉండాలి, రైతు శ్రమకు విలువ ఉండాలి, రైతు కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం ఉండాలి. అప్పుడే అన్నదాతను కేవలం దేశానికి ఆహారం అందించే వ్యక్తిగా కాకుండా, దేశ ఆర్థిక అభివృద్ధిలో సమాన భాగస్వామిగా గుర్తించినట్టవుతుంది.
2.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం కేవలం రైతు కుటుంబానికి సంబంధించిన సమస్య కాదు. ఇది దేశ ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, మార్కెట్ వ్యవస్థ మొత్తం మీద ప్రభావం చూపించే జాతీయ సమస్య. మూడు దశాబ్దాల క్రితం రైతు పొందిన పంట ధరతో పోలిస్తే నేటి వ్యవసాయ ఉత్పత్తి వ్యయం అనేక రెట్లు పెరిగింది. విత్తనాల నుంచి ఎరువుల వరకు, పురుగుమందుల నుంచి వ్యవసాయ యంత్రాల వరకు, డీజిల్ నుంచి కూలీల వరకు ప్రతి అంశం ధర పెరిగింది. భూమి కౌలు, విద్యుత్, నీటి ఖర్చులు, రవాణా వ్యయాలు కూడా రైతుపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. అయితే పంట అమ్మే సమయంలో మాత్రం రైతు తన ఉత్పత్తికి ధర నిర్ణయించే స్థితిలో లేకపోవడం అత్యంత బాధాకరం.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# త్రిశంకు స్వర్గంలో నిరుద్యోగ యువత కొట్టుమిట్టడుతుంది



ఉద్యోగాలు దక్కని చదువులు, ఉపాధి అవకాశాలు చూపని పాలకుల మధ్య త్రిశంకు స్వర్గం లో విద్యార్థి, నిరుద్యోగ యువత కొట్టుమిట్టడుతుంది. విద్యార్థి, నిరుద్యోగ యువత ని పాలకులు కేవలం ఓటు వేసే మర యంత్రాలుగా మాత్రమే చూస్తున్నారానటంలో సందేహం ఏమి లేదు. “వికసిత్ భారత్ “ పేరుతో ప్రచార ఆర్భాటల కే పరిమితం అయిన కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం మాట తప్పింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్నా 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని,
ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ రాష్ట్రములో కాంగ్రెస్ అధికారం లోకి రాగానే అటేకెక్కించింది.
మన తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన చైనా దేశం ప్రపంచం లో అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటే, సహజ వనరులు, సకల సంపదలు, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశల సాగు భూముల కంటే ఎక్కువ కలిగి, ప్రపంచం లోనే అత్యంత ఎక్కువ మంది గల యువత ఉన్నప్పటికీ సరైన అవకాశాల కల్పనా లేక నిరుద్యోగం తండావిస్తుంది.తెలంగాణ లో నిరుద్యోగిత రేటు 8.9% గా నమోదు అవుతుంది. దేశ సగటు కంటే నిరుద్యోగ రేటు ఎక్కువ గా ఉంది.2025 జిల్లా స్థాయి పిరియాడిక్ లేబర్ ఫోర్స్ (గూఖీ) ప్రకారం దేశం లో దాదాపు 250 జిల్లా లో 15-29 ఏళ్ల యువత లో 25 శాతం మందికి ఉద్యోగం, విద్యా, వృత్తి విద్యా శిక్షణ ఈ మూడింటి లో ఏది చేయడం లేదు. ఇది భవిష్యత్తు భారతనికి అత్యంత ప్రమాదకరం.
చదివిన చదువులకు ఉద్యోగాలు దొరక్క, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత కుంగుబాటుకి గురి అవుతుంది. యువత కి చదువు పూర్తి అయ్యాక గౌరవ ప్రాథమైనా స్థిరమైన ఉపాధి కల్పించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. చదివిన చదువులకు సంబంధం లేని, చాలి చాలని జీతాలతో ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తున్నా యువత నిస్తేజం లో జీవిస్తున్నారు. “నైపుణ్యభి వృద్ధి పునః కల్పన -2047 “ పేరుతో నీతి అయోగ్ విడుదల చేసిన నివేదిక 8.7 కోట్ల మంది యువత కి “పని “ లేదని, లేర్నింగ్ విత్ ఎర్నింగ్ అనేది ప్రధాన అవసరం గా ఉంది అని స్పష్టం ప్రకటించింది. అమెరికా, చైనా కంటే సాగు యోగ్య మైన భూములు మన దేశం లో అధికంగా ఉన్నాయి.
ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ యువత మన దేశం లోనే ఉంది. ప్రపంచం లోనే రెండవ అధిక జనాభా గల దేశం మనది. పుష్కలంగా ఉన్న మానవ వనరులను, జనాభా కి సరిపడా అవసరలను మనమే తయారు చేసుకోగలిగితే మన నిరుద్యోగ సమస్య కి పరిష్కారం దొరుకుతుంది, మన ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుంది.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి, ప్రచార ఆర్భాటలు మాని నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను జాంబో నోటిఫికేషన్ ల ద్వారా భర్తీ చేయాలి. వ్యవసాయ ఆధారిత దేశం మనది. “వ్యవసాయ విప్లవం” దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు “ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్” ప్రవేశ పెట్టి రైతంగానికి అండగా నిలిచి,ఏ ప్రజల అవసరాలకు, మార్కెట్ అవసరాలకు, వాణిజ్య అవసరాలకి అధిక పంటల దిగుబడి వచ్చే దిశగా ప్రణాళిక లు రూపొందించాలి. రైతంగం ఆర్థికంగా బలోపేతం అవుతుంది, గ్రామీణ నిరుద్యోగ సమస్యకి కొంత మేర పరిష్కారం దొరుకుతుంది.
“పారిశ్రామిక విప్లవం” తీసుకోవచ్చి, ఎక్కడి కాక్కడ ఈ దేశ ప్రజల మార్కెట్ అవసరలకు సరిపడా వివిధ పరిశ్రమలు నెలకొల్పి, స్థానికంగా యువత కి స్కిల్స్ నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలి. పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీ ల వరకు స్వయం ఉపాధి అవకాశాల కై స్కిల్ దెవలప్ మెంట్ కోర్స్ లను సబ్జెక్ట్ లో భాగంగా ప్రవేశ పెట్టాలి.కనీస మౌలిక సదుపాయలు కల్పించకుండా ,విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయుల ను నియమించకుండా, జీరో ఎన్ రోల్ మెంట్ పేరుతో రాష్ట్రము లో, దేశం లో వేలాది పాఠశాలలను మూసి వేస్తున్నారు.బడుల మూసి వేయడం అంటే భవిష్యత్తు భారతవానిని అంధకారంలో కే నెట్టడమే అవుతుంది.విద్యా రంగానికి 20% బడ్జెట్ లో కేటాయించి, నాణ్యమైన విద్యా అందే విధంగా, ఉపాధి అవకాశాలు చూపే విధంగా ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలి.మానవ వనరుల అభివృద్ధి కి బాటలు వేయాలి.
జిల్లాకి ఒక స్కిల్ డెవలప్ సెంటర్ ని ఏర్పాటు చేసి స్థానిక మార్కెట్, స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు చూపాలి. నిరుద్యోగ యువత కి, సబ్సిడీ రుణాలు ఇచ్చి, స్వయం ఉపాధి అవకాశలు కల్పిస్తే తలసారి ఆదాయం పెరిగి, దేశ,రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుంది. జాతీయ ఆదాయం పెరిగి అభివృద్ధి చెందుతున్న దేశల సరస నుండి సుస్థిర అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుంది. నిరుద్యోగ సమస్య పరిష్కారించ కుండా విద్యార్థి, నిరుద్యోగ యువతని కేవలం ఓటు వేసే మర యంత్రాలుగానే చూస్తూ, రాబోయే ఎన్నికల్లో మోస పూరిత హామీలతో ప్రజల మధ్య కి వచిన్నపుడు విద్యార్థి, నిరుద్యోగ యువత గల్లా పట్టి
నిలదీసి ప్రశ్నిస్తారు.లి
మీ గద్దెలు బారాబర్ దింపుతారు.
తస్మాత్ జాగ్రత్త....!!



- అనంతుల మధు
- తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన
కార్యదర్శి.ఫోన్ : 9505866698

# కార్మికుల సంక్షేమమే లక్ష్యం



- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

**శామీర్‌పేట్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం హకీంపేట్ ఆర్టీసీ డిపోలో జోరుగా సాగింది. అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డిపోలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులను కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి బాణం గుర్తుపై ఓటు వేయాలని కార్మికులను కోరారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం,వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికు లకు అనేక హామీలు ఇచ్చినా వాటిలో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో కార్మికుల మద్దతు తీసుకుని, తెలంగాణ ఏర్పడిన అనంతరం యూనియన్ వ్యవస్థపై ఆంక్షలు విధించారని అన్నారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్మికుల హక్కులు, సంక్షేమం,ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాల్లో అండగా ఉంటామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. హకీంపేట్ డిపో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కార్మికులకు అండగా ఉంటామని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి.రమేష్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.వెంకటేశం, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు యన్.నాగరాజు, హకీంపేట్ డిపో అధ్యక్షులు తులసిరామ్, సెక్రటరీ పవన్ యాదవ్, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు వైస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యస్.మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎ.నగేష్ యాదవ్, బి.కిషోర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు యస్.వేణుగోపాల్ రెడ్డి, ఆర్.శ్రీనివాస యాదవ్, వి.నర్సింహారెడ్డి, విష్ణు, యస్.ఆనంద్, పి.బాల్ రాజు, వి. శేశాంత్, భరత్ కుమార్, నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు కృష్ణా, శ్రీశైలం, పుష్పలత, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.88 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**శంషాబాద్, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో రూ.2.88 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. వార్డు 118లో రాఘవేంద్ర హోటల్ నుంచి సంఘీగూడ జంక్షన్ వరకు, వార్డు 119లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి కొత్వాల్ గూడలోని ప్లాట్ నంబర్ 114 వరకు డ్రైన్ నిర్మించనున్నారు. వర్షాకాలంలో వరద నీటి ముంపు సమస్యను పరిష్కరించే లక్ష్యంతో పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ లింగం యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నాయకులు గణేష్ గుప్తా, చంద్రారెడ్డి మహేందర్ రెడ్డి,డి. వెంకటేష్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేయాలి



**చేవెళ్ల, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** ఓబీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఈ నెల 4న శంషాబాద్ మండలం గొల్లపల్లిలో నిర్వహించనున్న 'ఓబీసీ సింహగర్జన' మహాసభను విజయవంతం చేయాలని చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు పీసీసీ ఓబీసీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభకు ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపీసీ చైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత్ రావు, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. 'జిస్కీ జిత్నీ సంఖ్యా, ఉత్నీ హిస్సేదారీ' నినాదాన్ని సాకారం చేసేందుకు ఓబీసీలు ఐక్యంగా నిలవాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, మైనారిటీ, ఎస్సీ, ఓబీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కొందుర్గులో వెండి నాణేల కలకలం

- పాడుబడ్డ గోడలు కులుస్తుండగా బయట పడ్డట్టు సమాచారం
- నాణేల కోసం ఎగబడ్డ జనం విషయం ఆలస్యంగా వెలుగులోకి



**కొందుర్గు, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో తీవ్ర కలకలం రేగింది. గ్రామంలోని ఒక పురాతన మట్టి ఇల్లును కూల్చివేసి, ఆ మట్టిని తరలిస్తుండగా భారీగా పురాతన వెండి నాణేలు బయటపడ్డాయి. అయితే, ఈ ఘటన జరిగి రెండు రోజులు అవుతున్నప్పటికీ, స్థానికులు రహస్యంగా ఉంచడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా ఏరుకున్న జనం స్థానికుల కథనం ప్రకారం.. కొందుర్గు గ్రామ నడిబొడ్డున ఉన్న ఒక పాత నివాసాన్ని యజమానులు కూల్చివేయించారు. ఆ తర్వాత జేసీబీ సహాయంతో ఆ మట్టిని, శిథిలాలను ట్రాక్టర్లలోకి ఎత్తి సమీపంలోని ఖాళీ స్థలంలో పడబోశారు. అందులోంచి వెండి నాణేలు మెరుస్తూ కింద పడ్డాయి. మొదట గమనించిన కొద్దిమంది కూలీలు, చుట్టుపక్కల వారు ఎవరికీ తెలియకుండా రహస్యంగా వాటిని ఏరుకున్నారు. తమకు దొరికిన నిధి గురించి బయటపడితే అధికారులు స్వాధీనం చేసుకుంటారనే భయంతో రెండు రోజుల పాటు ఈ విషయాన్ని పూర్తిగా గుట్టుగా ఉంచారు. ఈ విషయం రహస్యంగా ఉంచినప్పటికీ, ఈ నిధి వ్యవహారం కాస్తా లీకై గ్రామంలో క్షణాల్లో వ్యాపించింది. మట్టిలో ఇంకా నాణేలు ఉన్నాయనే వార్త తెలియడంతో నిమిషాల వ్యవధిలోనే వందలాది మంది జనం ఆ మట్టి కుప్పల వద్దకు ఉరుకులు పరుగులు పెట్టారు. నాణేల కోసం జనం ఎగబడ్డారు. చేతులతో, పారలతో, కర్రలతో మట్టిని తవ్వుతూ దొరికిన నాణేలను జేబుల్లో వేసుకున్నారు. కొంతమందికి నాలుగైదు నాణేలు లభించగా, మరికొందరికి అంతకంటే ఎక్కువే దొరికినట్లు సమాచారం. ఇవి నిజాం కాలం నాటి పురాతన వెండి నాణేలని ప్రచారం జరుగుతోంది.

## అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి నుంచి 10 గ్రాముల గంజాయి స్వాధీనం



**మర్పల్లి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మర్పల్లి గ్రామ పరిధిలోని అబ్దుల్ రహమాన్ వెంచర్ సమీపంలో మర్పల్లి గ్రామానికి చెందిన సిద్ధు అనే యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని పోలీసులు గమనించారు. అనుమానం రావడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి విచారించారు. ఈ తనిఖీల్లో అతడి వద్ద 10 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అబ్దుల్ రావుఫ్ తెలిపారు.

## చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి



**ఎల్బీనగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ వద్ద చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు అడిగి తెలుసుకుని, వారి సమస్యలపై చర్చించారు. వ్యాపారులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల మండలం మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ పగడాల యాదయ్య, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎం. చంద్రమోహన్, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మండపాక వీరయ్య, సరూర్‌నగర్ సర్కిల్ సీపీఎం నాయకులు సీహెచ్. వెంకన్న తదితరులు పాల్గొని, చిరు వ్యాపారులతో మాట్లాడారు.

## అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం

- 'అంగన్ మిలన్ సేవ'లో టీచర్లు, ఆయాలకు ఘన సన్మానం



**శంకర్‌పల్లి, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి టీచర్లు,ఆయాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ..చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య కోసం అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్ రు.అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు, అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సేవాభావంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను గుర్తించిసన్మానించడంస్ఫూర్తిదాయకమన్నరు.అంగన్‌వాడీ లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన నిధులు, సౌకర్యాలు కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం, సిబ్బంది జీవిత బత్తాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నప్పటికీ,రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,అనిశెట్టి సురేష్, ఏనుగు నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బిర్ల సురేష్, వీరేందర్,పండిత్‌రావు గౌడ్,అంజయ్య గౌడ్, బీజేవైఎం నాయకులు లోకేష్,బీసోల్ల వెంకటేష్, రుక్కుద్దీన్, దుర్గాప్రసాద్, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్ రెడ్డి నగర్‌లో రోడ్డు పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల పురోగతిని సంబంధిత అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బీఎన్ రెడ్డి నగర్‌లో రోడ్ల అభివృద్ధితో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరిగూడలో మట్టి మాఫియా గుట్టు రట్టు

- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన
- ఇబ్రహీంపట్నం ఖల్సా సర్వే నంబర్లు 1103, 1146లో జేసీబీలు, హిటాచీల ద్వారా యథేచ్ఛగా మట్టి తరలింపు
- జనం సాక్షి వరస కథనాలు
- రంగంలోకి దిగిన మైనింగ్, రెవెన్యూ, పోలీసులు
- అసైన్ మెంట్ భూములకు భద్రత కల్పిస్తామని హామీ



**రంగారెడ్డి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** మట్టి మాఫియా పై అధికారుల యంత్రం కదిలింది. రంగారెడ్డి జిల్లాలో రెచ్చిపోతున్న మట్టి మాఫియాపై జనం సాక్షి వరుస కథనాలు అందజేసింది. "మట్టి కొల్లగొట్టి", "మట్టి మాఫియాపై ఉక్కు పాదం" , "ఎమ్మెల్యే ఆదేశాలు భేకాతర్" అనే శీర్షికన కథనాలను ప్రచురించింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి మాఫియా పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ప్రభుత్వ భూముల్లో జరిపిన తవ్వకాలపై మెజర్మెంట్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై పెనాల్టీ వేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే అధికారం యంత్రాంగం కదిలింది. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మాఫియా గుట్టును గ్రామస్తులు రట్టు చేశారు. గత కొన్ని నెలలుగా ఉప్పరిగూడ గ్రామ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఖల్సా సర్వే నంబర్లు 1103 మరియు 1145 లో గల అసైన్ మెంట్ భూముల్లో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏమాత్రం అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా జేసీబీలు, హిటాచీలతో మట్టిని తవ్వుతూ పెద్ద పెద్ద గుంతలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహించడంతో, విసిగిపోయిన గ్రామస్తులంతా ఏకమై మట్టిని తరలిస్తున్న వాహనాలను ప్రత్యక్షంగా పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారిని అప్పగించడంతో పాటు, వారిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించారు. కానీ మట్టి వ్యాపారులు మాత్రం వెనకడుగు వేయలేదు. ఏదోరకంగా మట్టిని తరలిస్తూనే ఉన్నారు. కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ భూములనే టార్గెట్గా చేసుకున్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే 5వేలకు పైగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించారు. సుమారు రెండు కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి నష్టాన్ని మిగిల్చారు ఇదే విషయాన్ని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకుపోయారు.

### అధికారుల పరిశీలన, కొలతలు

ఈ ఘటనపై స్పందించిన అధికార యంత్రాంగం శనివారం ఉప్పరిగూడ గ్రామంలోని ఆయా సర్వే నంబర్లలోని భూములను పరిశీలించింది. మైనింగ్ ఆర్ఐ వెంకన్న స్వయంగా ఘటనా స్థలానికి వచ్చి భూములను పరిశీలించి, తవ్విన ప్రాంతంలో కొలతలు కొలిచి నష్టాన్ని అంచనా (ఎస్టిమేషన్) వేశారు. అలాగే రెవెన్యూ ఆర్ఐ మాధవి పంచనామా నిర్వహించగా, ఏ ఎస్ ఐ జంగయ్య కూడా క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో జీపీఓ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉప్పరిగూడ గ్రామానికి చెందిన దళితులు, బలహీన వర్గాల పేదలకు కేటాయించిన అసైన్ మెంట్ భూమిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా, రైతులకు తెలియకుండా మట్టిని తరలించడం అక్రమమని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, పేదల భూములను దోచుకుంటున్న ఇలాంటి అక్రమార్కులపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా గ్రామస్తులకు అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారు.

## సంతోషిమాత ఆలయాన్ని సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్



**ఎల్బీనగర్, అక్టోబరు 3 (జనం సాక్షి) :** సంతోషిమాత దేవాలయంలో ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయాలపై వరుసగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. దాడులకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు, వారిని రెచ్చగొడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని మతాల ప్రజల విశ్వాసాలు, ప్రాణాలు, ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలని, మత విద్వేషాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ సూచించారు. హిందువుల సహనాన్ని పరీక్షించవద్దని, ఆలయాలపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతి, సామరస్యాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
04 అక్టోబర్ 2026

# గిరిజన, బడుగు విద్యార్థులకు మెరుగైన వసతులు

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**కొల్లాపూర్, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** బడుగు, బలహీన వర్గాలు, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి సదుపాయాలు కల్పించడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.కొల్లాపూర్ పట్టణ పరిధిలో బడుగు, బలహీన వర్గాల పేద విద్యార్థుల కోసం రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్సీ బాలుర వసతి గృహ నూతన భవన నిర్మాణానికి శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.వసతి గృహంలో విద్యార్థులకు సురక్షితమైన వసతి, స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పనుల పురోగతిని పరిశీలించాలని సూచించారు.పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారు వసతి సమస్యలతో చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరి బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామస్తులు. సమాచారం అందిన వెంటనే హుటాహుటిన వికారాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులకు పరామర్శ. మెరుగైన వైద్య చికిత్స కోసం వెంటనే కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని అధికారులకు సూచన. మృతుల కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాద ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ప్రైవేట్ ట్రావెల్ డ్రైవర్ నిర్లక్ష్యం మూలంగానే ఘటన చోటుచేసుకుందని అన్నారు. ప్రమాద ఘటనపై పూర్తి విచారణ జరిపించి.. కారకులైన వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 10 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం సైతం బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్రంగా కలత చెందారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

## ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి



**నారాయణపేట, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం తగదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.కార్మికుల వేతనాలు పెంచాలని, వేధింపులు, అధిక పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల మొదటి రోజే వేతనాలు చెల్లించాలని, కాలపరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ కార్మికులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత, రోగుల సంరక్షణ, సూపర్వైజర్ సేవల కోసం ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) విధానం ద్వారా మూడేళ్ల కాలపరిమితితో ఏజెన్సీలను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. అయితే కాలపరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయకుండా పాత ఏజెన్సీ లకే అనుమతులు పొడిగించడం సరికాదని ఆరోపించారు.ప్రభుత్వ వైఖరి కారణంగా కార్మికులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అధిక పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఆసుపత్రిలో కొత్త భవనాలు, వార్డులు పెరిగినా అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగలేదని పేర్కొన్నారు.కాంట్రాక్ట్ కార్మికులకు నెల మొదటి రోజే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు.కార్మికులపై తప్పుడు ఆరోపణలు, వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీ జిల్లా నాయకులు ఎస్.సంతోష్, ఆసుపత్రి, మెడికల్ కళాశాల బ్రాంచ్ యూనియన్ నాయకులు, కార్మికులు గోవర్ధన్ రెడ్డి, కర్ణాకర్, రాము, వెంకటేష్, రాజు, ఎం.వెంకటేష్, రమేష్, ఖాదర్, రాజలింగం, మధు, శ్రీను, ప్రవీణ్, భీమిరెడ్డి, రాములమ్మ, గోవిందమ్మ, అంబిక, చెన్నమ్మ, ఎం.కవిత, అనురాధ, అనిత, అశ్విని, భూదేవి, సత్యమ్మ, రాధ, శ్వేత, ఆనంద, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి
- దిశ సమావేశంలో ఎంపీ డీకే అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** రైతులు, మహిళలు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల పై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డీకే అరుణ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ కమిటీ సమావేశానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో,కేంద్ర ప్రభుత్వ నిధుల తో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భం గా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను సాధించే విధంగా అధికా రులు బాధ్యతతో పనిచే యాలని సూచించారు. పథకాల అమలును క్షేత్రస్థాయి వరకు పకడ్బం దీగా తీసుకెళ్లడంతో పాటు నిర్ణీత గడువులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా తదుపరి అభివృద్ధి కార్య క్రమాలకు అనుమతులు, అదనపు నిధులు పొందేం దుకు అవకాశం ఉంటుం దని తెలిపారు. జిల్లా అభి వృద్ధిలో అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.వ్యవసాయ రంగంలో ప్రధానమంత్రి పీఎండీకేవై కార్యక్రమం కింద నారాయణపేట జిల్లాకు ప్రథమ స్థాయి అవార్డు లభించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగాన్ని ఎంపీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ఆకాంక్షించారు.

నారాయణపేట ఆస్పిరేషనల్ జిల్లాగా కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల ప్రారంభ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని సమన్వయంతో కొనసాగించాలని సూచించారు.

ఉట్కూర్ మండలం వల్లంపల్లి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని పీఆర్‌ఈఈ అశోక్‌ను ఎంపీ ఆదేశించారు.నారాయణపేట--మక్తల్ రోడ్డు పనుల ప్రారంభంపై కమిటీ సభ్యులు అడగగా, పనులు ప్రారంభమయ్యే వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్యను ఆదేశిం చారు.ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జిల్లాలో నిర్మిస్తున్న,నిర్మించాల్సిన రహదారుల వివరాలను పీఆర్ఈఈ అశోక్ వివరించారు. 2025-26 సంవత్సరానికి రూ.4,02,632 నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మార్చి 29న నిర్వహించిన ఎఫ్ ఎల్ ఎన్ ఎ టి పరీక్షకు 18,062 మందిని నమోదు చేయగా, 8,172 మంది ఉత్తీర్ణుల య్యారని వివరించారు. సెప్టెంబర్ 27న నిర్వహించి న రెండో దశ పరీక్షకు 24, 665 మందిని లక్ష్యంగా నిర్దేశించగా, 17,800 మంది హాజరైనట్లు తెలిపా రు.జిల్లాలో అక్షరాస్యత రేటు 49.93 శాతం, మహిళల అక్షరాస్యత రేటు 39.72 శాతంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సమగ్ర కార్యా చరణతో ముందుకు సాగు తున్నట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా పంచా యతీ,వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ,పంచాయతీ రాజ్,విద్యా శాఖ, డీ డబ్ల్యు ఓ, ఎస్సీ అభివృద్ధి, ఆర్ డబ్ల్యు ఎస్, పౌర సరఫరాల శాఖ, నాబార్డు, మైనింగ్ శాఖ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, భూగర్భ జల వనరుల శాఖ, చీఫ్ ప్లానింగ్, ఉద్యాన శాఖ, ఇరిగేషన్, కార్మిక శాఖ, నేషనల్ హైవే,ఆర్‌డబి శాఖల ద్వారా చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులు క్లుప్తంగా వివరించారు.

# అంగన్‌వాడీ, ఆశావర్కర్ల సేవలు అభినందనీయం

- మహిళా మోర్చా ఆధ్వర్యంలో "అంగన్ మిలాన్ సేవ" కార్యక్రమం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని రాంనగర్, వల్లభ్‌నగర్ వార్డుల్లో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా "అంగన్ మిలాన్ సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లను మహిళా మోర్చా కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పురస్కరించుకొని నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజానికి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఆప్యాయతతో సేవలందిస్తూ పోషకాహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాగే సమాజం ఆరోగ్యంగా ఉండటంలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పరిసరాల పరిశుభ్రత, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడం ఎంతో అవసరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్ల పాత్ర కీలకమని, వారి సేవలు అభినందనీయమని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత యాదవ్, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, రాష్ట్ర నాయకులు చిత్తారి ప్రభాకర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అలివేలమ్మ, జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి భారతి, పట్టణ అధ్యక్షులు బత్తిని మధు, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖలీల్, గోపాల్పేట మండల ఇన్‌చార్జి దాసరాజు ప్రవీణ్, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు గోపాల్ యాదవ్, గోపీనాథ్, నక్క మహేష్, జిల్లా ఐటీ సెల్ ఇన్‌చార్జి అంజి యాదవ్, పట్టణ నాయకులు చిన్న రాయుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డీజేఎఫ్ మహాసభలను విజయవంతం చేద్దాం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకురి డేవిడ్



**జడ్చర్ల, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** దళిత జర్నలిస్టు ఫోరం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, సత్యమే శ్వాసగా, ప్రజల గొంతుకగా నిలిచి పనిచేస్తున్న దళిత జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకురి డేవిడ్ పిలుపునిచ్చారు. శనివారం జడ్చర్లలో దళిత జర్నలిస్టు ఫోరం 11వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకురి డేవిడ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు, ఫోరం ప్రతినిధులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకురి డేవిడ్ మాట్లాడుతూ అక్టోబర్ 7న సంగారెడ్డిలోని పిఎస్ఆర్ గార్డెన్స్‌లో ఫోరం 11వ రాష్ట్ర మహాసభలు వైభవంగా జరగనున్నాయని, మహాసభలకు దళిత జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, దళిత జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ఎదుట రైతుల రాస్తారోకో



**రామాయంపేట, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** పంటలకు రోజుకు 12 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపిస్తూ రామాయంపేట సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. రామాయంపేట - మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పొలాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలకు నీరు అందక తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో కోతల కారణంగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకోలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు రోజుకు 12 గంటల విద్యుత్ అందించి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు

## స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



**సదాశివపేట, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** పట్టణంలోని 7వ వార్డు పరిధి సిద్దాపూర్ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక ఏర్పాటు కోసం తగిన స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం డిప్యూటీ తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ప్రజలు అధికారులను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో స్మశాన వాటిక లేకపోవడంతో మృతదేహాలను సొంత పొలాల్లో ఖననం చేయాల్సి వస్తోందని తెలిపారు. సదాశివపేట స్మశాన వాటికలో ఖననం చేసేందుకు గతంలో పలుమార్లు అభ్యంతరాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. సిద్దాపూర్ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, రామ్‌రెడ్డి, ఎం.ఆంజనేయులు, బి.శంకరయ్య, బి.శ్రీనివాస్, అనంతరం గౌడ్, ఎం.లక్ష్మయ్య, జై చంద్రశేఖర్, ఎస్.సుధాకర్, గూడెం మాధవరెడ్డి, అయూబ్ పాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**కొల్చారం, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామ పరిధిలోని వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో ఉల్లికోడు, ఆకు ముడత పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఉల్లికోడు ఆశించిన వరి మొక్కల్లో ఆకుల తొడిమలు గొట్టం మాదిరిగా మారి తెల్లటి వెండి రంగులో కనిపిస్తాయని తెలిపారు. దీనినే 'సిల్వర్ షూట్' లక్షణంగా పేర్కొన్నారు. ఉల్లికోడు సోకిన పిలకల్లో సాధారణంగా గింజలతో కూడిన కంకులు ఏర్పడవని, మొక్కల ఎదుగుదల మందగించి పిలకలు సరిగా కట్టవని వివరించారు. అదేవిధంగా ఆకు ముడత పురుగు ఆశించిన మొక్కల ఆకులను పోగులుగా చుట్టుకుని లోపలి భాగాన్ని గీకి తింటుందని తెలిపారు. దీంతో ఆకులపై తెల్లటి చారలు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగుతుందని, ఫలితంగా మొక్క ఎదుగుదల తగ్గుతుందని చెప్పారు. ఉల్లికోడు, ఆకు ముడత పురుగు నివారణకు కార్బోసల్ఫాన్ 25% ఇ.సి. 300-400 మిల్లీలీటర్లు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60--80 మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ చైర్మన్ నర్సిములు, వైస్ చైర్మన్ గోవర్ధన్, సీతారాం తండా సర్పంచ్ మోహన్‌సింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు అమృత్, శ్రీనివాస్, నర్సిములు, బాలయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యల దరఖాస్తులు పరిష్కరించాలి

- రీ సర్వేను వేగవంతం చేయాలి
- కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 03,(జనంసాక్షి):** జిల్లాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా దరఖాస్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతల్లోనే రాకపోకలు

- కొమురవెల్లి రహదారి దుస్థితిపై అధికారుల నిర్లక్ష్యం..



**రెబ్బెన, అక్టోబర్03( జనం సాక్షి):** రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామంలోని ప్రధాన రహదారి దుస్థితిపై పలుమార్లు వార్తలు ప్రచురించినా, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి గుంతలమయమై వాహనదారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రహదారి దుస్థితిపై గ్రామపంచాయతీ కార్యదర్శికి పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, అలాగే పంచాయతీరాజ్ శాఖ ఏఈ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా పరిష్కారం మాత్రం కనిపించకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వర్షాలు కురిసిన ప్రతిసారి రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ద్విచక్ర వాహనదారులు, రైతులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం తర్వాత బురదగా మారుతున్న రహదారిపై రాకపోకలు మరింత కష్టతరమవుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు సమస్యను చెప్పినా, వార్తల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోతే ఇక సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రహదారి ఏ శాఖ పరిధిలో ఉందనే విషయాన్ని పక్కనపెట్టి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. కనీసం తాత్కాలికంగా గుంతలను పూడ్చడంతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఫిర్యాదు చేసినా స్పందన లేదు.. వార్తలు రాసినా చలనం లేదు.. మరి అధికారులు స్పందించేది ఎప్పుడు? అన్న ప్రశ్న ఇప్పుడు కొమురవెల్లి గ్రామస్థుల్లో వ్యక్తమవుతోంది. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి రాకముందే పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ ఏఈతో పాటు సంబంధిత అధికారులు రహదారి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామపంచాయతీ మంచినీటి బావిపై కమ్ముకున్న చెట్లను తొలగించరూ!



**చెన్నారావుపేట, అక్టోబర్ 3( జనం సాక్షి):** గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి బావి పై కమ్ముకున్న చెట్లను తొలగించాలని చెన్నారావుపేట గ్రామస్తులు కోరుతున్నారు. చెన్నారావుపేట- నెక్కొండ ప్రధాన రహదారి పక్కనే గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి బావి ఉంది. ఈ బావి నీటినే ప్రతిరోజు నల్లాల ద్వారా సరఫరా చేస్తుంటారు. మంచినీటి బావి చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి కమ్ముకున్నాయి. అంతేకాక ఆకులు రాలి మంచినీటి బావిలో పడుతున్నాయి. దీంతో మంచినీటి బావిలోని త్రాగునీళ్లు కలుషితమయ్యే అవకాశం ఉందని ఆ నీటిని తాగడం లేదా వినియోగించడం వల్ల వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గ్రామపంచాయతీ పాలకులు, పంచాయతీ అధికారులు మంచినీటి బావి చుట్టూ కమ్ముకున్న చెట్లను బావిలోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించి స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'సర్ సర్వేతో ఓట్లు తొలగించడం అన్యాయం!

- ఆర్టీఐ జిల్లా కో-కన్వీనర్ కుమార్ యాదవ్



**మల్హర్, అక్టోబర్ 03(జనంసాక్షి) :** సర్ సర్వే పేరుతో ఓట్లను తొలగించడం అన్యాయమని యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కోకన్వీనర్ చింతల కుమార్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఎన్నికల సిబ్బంది తప్పిదంతో అమాయక ఓటర్లను జాబితా తొలగించి నోటీస్ లు జారిచేయడంపై ఓటర్లు అయోమయానికి గురివుతున్నట్లుగా వాపోయారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వెంటనే సర్ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. నోటీస్ జారీ చేసిన ఏఓటరుకైన సంబంధించిన బిఎల్ఓ ఆ ఓటరు ఇంటికి వెళ్లి పత్రాలు సేకరించి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలనే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. ఓటర్లు విచారణకు సంబంధించిన కార్యాలయానికి హాజరు కావాల్సిన అవసరం కూడా లేదనే నిబంధన ఆచరణకు నోచుకోవడం లేదన్నారు.

## జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తప్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 03 ( జనం సాక్షి ) :** దేశ ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతలనుంచి తప్పించాలని, ఎన్నికలకమిషన్ స్వతంత్రతను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నా రు. చిల్పూర్ మండలం క్రిష్ణాజీగూడెంలో సీపీఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం, మండల కార్యదర్శి సాదం రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికిహాజరైన రాపర్తి రాజు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఎన్నికల వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన రాజ కీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగిం చుకునే ప్రయత్నం చేస్తోందని సీపీఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు విమర్శించారు. ఎన్ని కల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా తన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న జ్ఞానేశ్ కుమా ర్ 2025 ఫిబ్రవరి 19న బాధ్యతలు స్వీకరించార ని ఎన్నికల కమిషన్ అధికారికంగా పేర్కొందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు, రాజకీ య పార్టీలలో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష అవసరమని అన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ గద్ద కోమల, పోలు సంపత్, అపార దాపు రాజు, ఆవుల ప్రభాకర్, బర్మ రవి, ఊరడి బుచ్చిరాజ్, గద్ద కూమర్ ఊరడి లింగయ్య, పోలు శ్రీనివాస్, ముడిక బీమయ్య, సాదం రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో 9న మెగా జాబ్ మేళా

- పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే గండ్ర..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 9న పుష్ప గ్రాండ్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. టాస్క్ సంయుక్త సహకారంతో నిర్వహించే ఈ జాబ్ మేళా పోస్టర్‌ను టాస్క్ సీఈఓతో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరుకానున్నారని, మేళాలో ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు అందజేస్తారని, గ్రామీణ యువతకు ఉచిత రవాణా, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గత మేళా ద్వారా వందలాది మందికి ఉద్యోగాలు లభించాయని, అదే స్ఫూర్తితో ఈసారి మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఏజెంట్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- 5న హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- ఇండియా కూటమి పార్టీల ఉమ్మడి పిలుపు



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 3 (జనం సాక్షి) :** బీజేపీ ఏజెంట్, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ హరిత హోటల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇండియా కూటమి నాయకులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, తెలంగాణ జన సమితి నాయకులు చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్నిఅపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ అడ్డ దారిలో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకున్నదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదటి నుండి చేస్తున్న ఆందోళన నిజమైందని అన్నారు. మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బిజెపిలో చేర్చుకున్నారని, నేడు ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమంగా ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎన్నికలలో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదని అన్నారు. ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఓట్ చోరీపై ఆందోళనకు పిలుపునిచ్చిందని, ఈ నెల 5న హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ నుండి ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి అనిల్ ప్రియాంక, నాయకులు మార్క విజయ్ కుమార్, బంక సరళ, సంపత్, పింగళి వెంకట్రామ్ రెడ్డి, జక్కుల రవీందర్, బోడ డిన్న, సిపిఐ నాయకులు ఆదరి శ్రీనివాస్ తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, సిపిఎం నాయకులు బొట్ల చక్రపాణి, టి. ఉప్పలయ్య, వీరన్న, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత మహిళా వివోఏపై దాడి అమానుషం

**నెక్కొండ అక్టోబర్ 3 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలో ని కుల అహంకారం, రాజకీయ పలుకుబడితో దళిత మహిళా వివోఏ మాధవిపై మాజీ సర్పంచ్ భర్త కొప్పోలు అమర్ నాథ్ అసభ్య పదజాలంతో దుషిస్తూ, దాడి చేయడం సిగ్గుచేటని ఎంఆర్పిఎస్(టిఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మాదిగ ధ్వజమెత్తారు. శనివారం నెక్కొండ మండల కేంద్రంలో మాట్లాడుతూ... నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని పి.కె మల్లెపల్లి గ్రామంలో వివోఏగా విధులు నిర్వర్తిస్తున్న గనిపల్లి మాధవిపై అదే గ్రామ మాజీ సర్పంచ్ పార్వతమ్మ భర్త అమర్ నాథ్ అసభ్య పదజాలంతో దుషిస్తూ, గ్రామ పంచాయతీ సాక్షిగా దాడి చేయడం కుల అహంకారానికి నిదర్శమని, రాజకీయ పలుకుబడితో దళిత మహిళలపై దాడి చేయడం పౌశాతికత్వానికి నిదర్శమని, నిండు గ్రామసభలో దళిత మహిళా వివోఏపై అసభ్య పదజాలం, కులాన్ని దూషిస్తూ దాడి చేసిన అమర్ నాథ్ పై వెంటనే ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసుతో పాటు వివోఏగా విధుల్లో ఉన్నటువంటి మహిళా అధికారి విధులకు ఆటంకం కలిగించిన పలు కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ రక్షణ సేనలో భారీగా చేరికలు



**నెరడిగొండ అక్టోబర్3(జనంసాక్షి):** బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలంలోని మాన్కు గూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు మహిళలు టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోథ్ ఇంచార్జ్ ,మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాథోడ్ బాపురావు కు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు డోలు చప్పుళ్ల మధ్య పూలు చల్లుతూ ఆయనను గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక నాయకులు, ప్రజల నుంచి తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. రాథోడ్ బాపురావు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో తమ ప్రాంతంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా కొందరు స్థానికులు గుర్తుచేసుకున్నారు. గతంలో చేపట్టిన పనులతో పాటు ప్రస్తుతం గ్రామానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ముందుకు తీసుకెళ్లాలని వారు కోరినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై రాబోయే రోజుల్లో మరింత మంది గ్రామస్థులు పార్టీలో చేరే అవకాశం ఉందని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, మాన్కు గూడ గ్రామస్థులు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్‌లో వైద్య ఏర్పాట్ల పరిశీలన

- భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- డాక్టర్ రవీంద్ర నాయక్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 03 (జనంసాక్షి) :** జిల్లా పరిధిలోని పుష్కర ఘాట్‌ను రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ శుక్రవారం పరిశీలించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన వైద్య, అత్యవసర చికిత్స ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్యం అందించేలా సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆకాష్, కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు

- అదుపులోకి తీసుకున్న చిట్యాల పోలీసులు
- జూకల్ కెనాల్ సమీపంలో పట్టుబడ్డ యువకులు



**చిట్యాల, అక్టోబర్ 3( జనం సాక్షి):** మండలంలోని జూకల్ శివారులో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం జూకల్ కెనాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కొంతమంది గంజాయి సేవిస్తున్నట్లు ఎస్సై-2 పి.ఓంపాల్‌కు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా, పోలీసులను చూసి పారిపోతున్న చల్లగరిగాకు చెందిన మ్యాదరి ప్రశాంత్ (24), దూడపక ప్రకాష్ (21), బైస బన్నీ (23), కుంచం బన్నీ (22), ముచినిపర్తికి చెందిన పసరగొండ సంజయ్ రాజ్ (19)లను వెంబడించి పట్టుకున్నారు. నిందితులకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో గంజాయి తాగినట్లు పాజిటివ్ రావడంతో వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. మండలంలో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03(జనంసాక్షి ):** వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు ఒక దిక్సూచి లాంటివారని, వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు, కుటుంబాన్ని నిలబెట్టిన తీరు నేటి తరం పాటించాలని తెలిపారు. వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని, వారి అనుభవాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధురాలు మహిళా సంఘాలలో సభ్యులుగా చేరితే ఎంతో భరోసా కలుగుతుందని, వ్యక్తిగత సమస్యలు గ్రూపు సభ్యులతో చర్చించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నం. 14567 కు కాల్ చేసి వివరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించిన రాజేశ్వరి, భూదేవి లను శాలువాలతో సన్మానించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
04 అక్టోబర్ 2026

# విద్యార్థి దశ ఎంతో కీలకమైనది

- చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను అలవర్చుకోవాలి
- ముఖ్య అతిథి శేషాద్రి ముదిలీ
- విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- కళాశాల ప్రిన్సిపాల్ పీ. శరత్‌చంద్ర




**తాండూరు, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలోని తులసి గార్డెన్‌లో శాలివాహన డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేషాద్రి ముదిలీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత సమాజానికి తమ వంతు సేవ అందించాలని, మంచి విలువలు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ పీ. శరత్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమాజంలో మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కళాశాల తరఫున అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు కల్వ రాధాకృష్ణ, కరస్పాండెంట్ ఎం మాణిక్యం, డైరెక్టర్లు కటకం వీరేందర్, బంటారం సుధాకర్, నగారం మల్లేశం, రాధమ్మ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్‌పై హత్యాయత్నం కుట్ర చేధన

- అప్పు ఎగ్గొట్టేందుకు హత్యాయత్నం
- 5 లక్షలు డీల్ 2 లక్షలు అడ్వాన్స్
- కేసు చేదించిన ఎస్ఐ నాగరాజు, సాయి కిషోర్ అభినందించిన డిఎస్‌పి

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** పాల్వంచ పట్టణంలో సెప్టెంబర్ 7న జర్నలిస్ట్ మనుపూరి ప్రభాకర్‌పై జరిగిన దాడి వెనుక ఉన్న సుపారీ హత్య కుట్రను పాల్వంచ టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి సతీష్ కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 07న రాత్రి సుమారు 08:30 గంటల సమయంలో పాల్వంచలోని కనకదుర్గ బార్ నుండి బయటకు వస్తున్న ఎన్ హెచ్ 9 ఎలక్ట్రానిక్ మీడియా ఛైర్మన్, జర్నలిస్ట్ ప్రభాకర్ (54) పై ముగ్గురు వ్యక్తులు సోడా బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని. బాధితుడి ఫిర్యాదు మేరకు పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నం. 345/2026 ద్వారా సెక్షన్లు 296(ఎ), 118(1), 351(2) r/w 3(5) బీఎన్ఎస్ కింద నమోదు చేసినట్లు అన్నారు. ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం అని పోలీసుల దర్యాప్తులో భాగంగా కాల్ డేటా రికార్డులు సీసీటీవీ ఫుటేజ్ మరియు ఇతర సాంకేతిక ఆధారాలను




పరిశీలించారని ఈ దాడి వెనుక పెద్ద కుట్ర ఉన్నట్లు విచారణలో తేలిందని, పాల నాగేశ్వరరావు అనే వ్యక్తి ప్రభాకర్ వద్ద గతంలో 40 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని ప్రభాకర్ ఒత్తిడి చేయడంతో, ఆయనను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని నాగేశ్వరరావు పథకం పన్నాడని. ఈ క్రమంలో కొత్తగూడెం పెట్రోల్ బంక్ పంప్ ఆపరేటర్ దాసరి రాజును సంప్రదించగా, రాజు కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉన్న అరవ వినయ్ కుమార్‌ను పరిచయం చేశాడు. ప్రభాకర్‌ను హతమార్చేందుకు 5 లక్షల రూపాయలకు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, ముందస్తు ఖర్చుల నిమిత్తం 2 లక్షల రూపాయలను అడ్వాన్స్‌గా చెల్లించారు.

### పథకం ప్రకారం దాడి చేయడానికి సిద్ధమై

సంఘటన జరిగిన రోజు మధ్యాహ్నం నాగేశ్వరరావు, ప్రభాకర్ ఇద్దరూ కలిసి బార్‌లో మద్యం సేవించారు. సాయంత్రం బయటకు వచ్చిన తర్వాత నాగేశ్వరరావు ఫోన్ చేసి ప్రభాకర్ ఎక్కడున్నాడో ఆరా తీసి, అతడి కదలికల సమాచారాన్ని దాసరి రాజు ద్వారా వినయ్ కుమార్‌కు అందించాడు. సమాచారం అందుకున్న వినయ్ కుమార్ తన అనుచరులతో కలిసి బార్ వద్ద కాపుకాసి ప్రభాకర్‌పై దాడికి పాల్పడినట్లు తెలిపారు.

### నిందితుల వివరాలు

అరవ వినయ్ కుమార్, ఎలగడ శివ కృష్ణ, దాకూరి గణేష్, దాసరి రాజు, పాల నాగేశ్వరరావు. ప్రస్తుతం ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు మరియు సాంకేతిక ఆధారాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, పట్టుబడిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి జుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ప్రధానంగా టౌన్ ఎస్ హెచ్ ఓ టి నాగరాజు ఎస్సై సాయి కిషోర్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి కానిస్టేబుల్ లక్ష్మణ్ కేసు కోసం నిరంతరం కృషి చేసినందుకు డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సిఐ సతీష్ ఎస్ ఐ లు టి నాగరాజు, సాయి కషోర్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి ,అబ్బురం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందని



అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో కట్టుకాచారం, కొత్తగూడెం, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు.

మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రెండవ విడతలో సుమారు 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.
ఈ సందర్భంగా మంత్రి నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సైదులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో నూతన ఇన్‌పేషెంట్ విభాగం ప్రారంభం

**కోదాడ, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మాణం చేసిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం కోదాడలో ప్రజలకు మెరుగైన,



నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, నూతన భవన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. రూ.26 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, ప్రస్తుతం ఆసుపత్రి రెనోవేషన్‌తో పాటు నూతనంగా నిర్మాణం చేసిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగం పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నేటి నుంచి ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు ప్రారంభమయ్యాయని, కోదాడ నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులు, అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఓ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ పోటీల్లో సంగారెడ్డి పోలీసులకు పతకాల పంట

- బంగారు, కాంస్య పతకాలు సాధించిన పోలీసు ఎస్పీ అభినందనలు



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 3 జనం సాక్షి) :** తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ క్రీడా పోటీల్లో సంగారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది సత్తా చాటారు. 50 ఏళ్లు పైబడిన వారి విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్ బంగారు పతకం సాధించగా, మహిళల ఓపెన్ డబుల్స్ విభాగంలో శ్రావ్య, ధరణిలు కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ శాలువాలతో సత్కరించి అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్ పాల్గొన్నారు.

# అల్లీపురం వేదికగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా అల్లీపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. భద్రాద్రి రాముడు కొలువైన ఖమ్మం జిల్లాలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఖమ్మం నగరంలోని అల్లీపురం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్థలాన్ని శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి కేటాయించిన భూమి విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అన్నారు. భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ నిర్మాణానికి ఎంతో భక్తి భావంతో ఆమోదం తెలిపారని మంత్రి పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు సహకారంతో ఆలయ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

### ఈ నెల 12న అంగరంగ వైభవంగా భూమిపూజ

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఈ నెల 12న అల్లీపురం వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళను హతమార్చి దహనం

**కుల్కచర్ల, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** అదృశ్యమైన మహిళను హతమార్చి మృతదేహాన్ని దహనం చేసిన ఘటన కలకలం రేపింది. కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన,అమృతమ్మ(34) సెప్టెంబర్ 18న అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు..అదే గ్రామానికి చెందిన మంగలి ఆనంద్(28)ను అనుమానంతో,విచారించారు. అమృతమ్మతో



అతడికి గతంలో సన్నిహిత సంబంధాలు, ఆర్థిక లావాదేవీలపై వివాదం ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఆమెను మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లి గండీడు మండలం వెన్నచేడు చెరువు కట్ట సమీపంలో హతమార్చి,మృతదేహాన్ని దహనం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అవశేషాల కోసం గాలింపు చేపట్టారు. ఫోరెన్సిక్, వైద్య ఆధారాలను సేకరిస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు, ఎస్ఐ రమేష్ తెలిపారు.

# గ్రామసభలో వాగ్వాదం

- సర్పంచ్ భర్తపై అఖిలపక్షం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- మహిళా సర్పంచ్ ను ఎవరు దూషించలేదు

**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవి చెరువు గ్రామపంచాయతీలో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శికి గ్రామ సమస్యలను వివరిస్తూ, సర్పంచ్‌ను ప్రశ్నిస్తున్న సమయంలో సర్పంచ్ సుర్వి సౌజన్య భర్త సుర్వి రాజు గౌడ్



జోక్యం చేసుకుని తనను దూషించారని గ్రామానికి చెందిన లింగస్వామి గౌడ్ ఆరోపించారు. సర్పంచ్ భర్త గ్రామపంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ గ్రామ ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని కొంతమంది గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సర్పంచ్ సౌజన్య భర్త సుర్వి రాజు గౌడ్‌పై ఫిర్యాదు చేశారు. తనను దూషించిన ఘటనపై విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లింగస్వామి గౌడ్ పోలీసులను కోరారు. గ్రామ సభలో జరిగిన ఘటనపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుర్వి లింగస్వామి, వినోద్, భారత రాష్ట్ర సమితి గ్రామ శాఖ అధ్యక్షులు ఏర్పుల రాజేష్, సిపిఐ పార్టీ నాయకుడు సూర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క శేఖర్ యాదవ్, సిపిఎం పార్టీ తరపున గుండు అంజయ్య, లింగస్వామి,విరమళ్ళ నరసింహా,గుండు రాజు గౌడ్, బి ఆర్ ఎస్ నాయకులు గుండు లింగన్న గౌడ్, లింగ స్వామి గౌడ్, హనుమంతు గౌడ్, ఏర్పుల రమేష్, సుర్వి శ్రీ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళపై దాడి

- నిందితులపై అట్రాసిటీ కేసులు పెట్టాలి
- పీ.కే. మల్లెపల్లిలో ఘటనపై కెవిపిఎస్ ఆగ్రహం



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** చింతపల్లి మండలం పీ.కే. మల్లెపల్లి గ్రామంలో గ్రామ సభ సందర్భంగా దళిత మహిళ వీఓఏ గనిపల్లి మాధవిపై జరిగిన దాడిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్.) తీవ్రంగా ఖండించింది. ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కె.వి.పి.ఎస్. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. గ్రామ సభలో మాధవిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించిన వీడియో కూడా వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రజల సమక్షంలో ఒక దళిత మహిళపై దాడి చేయడం, అవమానించడం ప్రజాస్వామ్య సమాజంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

### బాధితురాలికి రక్షణ కల్పించాలి

ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేయాలని నాగార్జున కోరారు. బాధితురాలికి తక్షణ రక్షణ కల్పించడంతో పాటు, ఆమెకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
నల్లగొండ జిల్లాలో దళితులు, గిరిజనులపై కుల దూషణలు, దాడులు తదితర ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చట్టపరమైన రక్షణ, న్యాయం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.
ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. జిల్లాలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, కుల వివక్ష ఘటనలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పర్యవేక్షించి కఠిన చర్యలు చేపట్టాలని పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ గొంతెత్తాలని పిలుపునిచ్చారు.

# పామాయిల్ గెలల అక్రమ తరలింపు కేసులో 9 మంది అరెస్ట్

- 2 ఆటోలు, పామాయిల్ గెలలు, నగదు స్వాధీనం

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు, దమ్మపేట పోలీసులు పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న ముఠాపై చర్యలు చేపట్టి 9 మంది నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలకు తరలించే సమయంలో, యజమానులకు తెలియకుండా కొంత మొత్తంలో పామాయిల్ గెలలను మార్గమధ్యంలో దించి అక్రమంగా తరలించి విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గత నాలుగు నెలలుగా బుగ్గపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బత్తిన రాము, ట్రాక్టర్ డ్రైవర్లు గడ్డం మహేంద్ర, కీసరి నాగరాజు, నాగబాబు తదితరులు వివిధ గ్రామాల నుంచి పామాయిల్ గెలలను అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు



తరలించే సమయంలో కొంత భాగాన్ని మార్గమధ్యంలో దించి, యజమానులకు తెలియకుండా అక్రమంగా తరలించి విక్రయించినట్లు విచారణలో తేలింది. అదేవిధంగా, కనితి లక్ష్మీనారాయణ అక్రమంగా సేకరించిన పామాయిల్ గెలలను కనితి శివ, వంక చందు తమ ఆటోల ద్వారా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి తరలించడంలో సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పొట్ట ముత్యాలరావుతో పాటు మరికొందరికి కూడా సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అలాగే జక్కా బాలు, కారం వెంకటేష్, చి. పుల్లారావు తమ ఖీ-జశీవలను ఉపయోగించి పామాయిల్ గెలల విక్రయాలకు సహకరించడంతో పాటు, వాటి ద్వారా జరిగిన నగదు లావాదేవీల్లో భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు పరస్పరం సమన్వయంతో పామాయిల్ గెలలను అక్రమంగా తరలించి, విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేసి, 2 ఆటోలు, పామాయిల్ గెలలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పామాయిల్ గెలలను అక్రమంగా తరలించడం, దొంగతనం చేయడం, ఖీ-జశీవలను దుర్వినియోగం చేయడం లేదా ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు సహకరించడం చట్టపరంగా నేరమని పోలీసులు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దర్యాప్తులో అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, దమ్మపేట ఎస్ఐ బాలస్వామి మరియు దమ్మపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# డేటా సెంటర్లకు పోటాపోటీ

## పాలసీలతో ఆకర్షిస్తున్న తెలంగాణ భూమి, ప్రోత్సాహకాలతో ఏపీ ముందంజ



**హైదరాబాద్(జనంసాక్షి):** డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ డేటా సెంటర్లకు గిరాకీ పెరుగుతోంది. దీంతో ఈ భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య పోటీ మొదలైంది. విద్యుత్తు, రాయితీలు, భూమి, మూలధన ప్రోత్సాహకాలు, అనుమతుల సరళీకరణ వంటి అంశాల్లో రాష్ట్రాలు ప్రత్యేక విధానాలు తీసుకొస్తున్నాయి. ఈ పోటీలో తెలంగాణ అత్యంత ఆకర్షణీయమైన డేటా సెంటర్ పాలసీని అందిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచింది. భూమి, మూలధన మద్దతు, ఇతర ప్రోత్సాహకాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ ఎనర్జీ రూపొందించిన 'డేటా సెంటర్ పాలసీ అట్రాక్టివ్‌నెస్ ఇండియా (డీసీపీఏఐ)' సూచీలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 'ఇండియా ఫార్వర్డ్–రీఇమాజినింగ్ గ్రోత్' నివేదికలో భాగంగా ఈ సూచీని రూపొందించారు. 2016 నుంచి 11 రాష్ట్రాలు అమలు చేస్తున్న ఐటీ, ఐటీఈఎస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు సంబంధించిన 19 విధానాలను ఈ సంస్థ విశ్లేషించింది. డేటా సెంటర్ల పాలసీ ఆకర్షణలో తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తొలి క్లస్టర్‌లో ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాలు దాదాపు 100కు 50 స్కోరు స్థాయిలో ఉన్నాయి. విద్యుత్తు, నియంత్రణ పరమైన ప్రోత్సాహకాల విషయంలో డేటా సెంటర్లకు బలమైన ప్యాకేజీలను తెలంగాణ అందిస్తోంది. డేటా సెంటర్లు నిరంతరం పనిచేయాల్సి ఉండటంతో విద్యుత్తు లభ్యత, టారిఫ్ ప్రయోజనాలు కీలకం. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు విద్యుత్తుతో పాటు మౌలిక వసతులు, మూలధన ప్రోత్సాహకాలు, నియంత్రణపరమైన ప్రయోజనాలు అందిస్తున్నాయి. హైపర్‌స్కేలర్లను ఆకర్షించడం కోసం విద్యుత్తు, సులభతర వ్యాపార నిర్వహణ చర్యలకు గుజరాత్ ప్రాధాన్యం ఇస్తోంది. డేటా సెంటర్ పాలసీ ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ రెండో క్లస్టర్ (42–45 స్కోరు)లో ఉన్నప్పటికీ భూమి, మూలధన మద్దతు విషయంలో ఈ రాష్ట్రం అగ్రగామిగా ఉందని ఎస్అండ్‌పీ గ్లోబల్ పేర్కొంది. డేటా సెంటర్ల ప్రాజెక్టులకు భారీ స్థాయిలో భూమి అవసరం. డేటా సెంటర్ల నిర్మాణానికి సర్వర్లు, విద్యుత్తు మౌలిక వసతులు, కూలింగ్ వ్యవస్థలు, నెట్‌వర్క్ సదుపాయాలు వంటి వాటిపై భారీగా మూలధన వ్యయం చేయాల్సి ఉంటుంది. భూమి కేటాయింపు, మూలధన ప్రోత్సాహకాల విషయంలో ఏపీకి ఉన్న బలం, డేటా సెంటర్ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా మారుతోంది. కర్ణాటక, ఒడిశా, హరియాణా కూడా పాలసీ పరంగా రెండో క్లస్టర్‌లో ఉన్నాయి. కర్ణాటక సులభతర వ్యాపార నిర్వహణ విషయంలో ప్రత్యేకంగా నిలిచింది. ప్రాజెక్టు మొత్తం జీవితకాలానికి వర్తించే ప్రోత్సాహకాలపై ఒడిశా, హరియాణా దృష్టి పెట్టాయి. డేటా సెంటర్లను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య పోటీ పెరగడానికి కొన్ని కారణాలను ఎస్అండ్‌పీ గ్లోబల్ విశ్లేషించింది. ఈ ప్రాజెక్టులు సాధారణ ఐటీ కార్యాలయాలతో పోలిస్తే భారీగా విద్యుత్తు, భూమి, మౌలిక వసతులను వినియోగిస్తాయి. వీటి నిర్మాణ దశలోనూ, నిర్వహణ సమయంలోనూ పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తాయి. అందుకే, రాష్ట్రాలు ఒకవైపు భూమి, మూలధన రాయితీలు ఇస్తూనే..మరోవైపు విద్యుత్ ధరలు, పునరుత్పాదక ఇంధనం, అనుమతుల్లో వేగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి.. దీన్ని 'కాంపిటేటివ్ ఫెడరలిజం'గా పేర్కొంది. భారత్‌లో డేటా సెంటర్ల విస్తరణ వేగం రానున్న రోజుల్లో మరింత పెరగనుంది. ప్రస్తుతం దేశంలో డేటా సెంటర్ల సామర్థ్యం 1.5 గిగావాట్‌గా ఉంది. రాబోయే పదేళ్లలో మరో 5 గిగావాట్ సామర్థ్యానికి ప్రతిపాదనలు ఇప్పటికే వచ్చాయి. ఇంకో 6–7 గిగావాట్ సామర్థ్యం ప్రాథమిక ప్రణాళిక దశలో ఉంది. 2031–32 నాటికి దేశీయ సామర్థ్యం 26.3 గిగావాట్లకు పెరుగుతుందని అంచనా. డేటా సెంటర్ల విస్తరణతో విద్యుత్తు అవసరమూ భారీగా పెరగనుంది. సర్వర్లతో పాటు కూలింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ వంటి వ్యవస్థలు పెద్ద మొత్తంలో విద్యుత్తును వినియోగిస్తాయి. ఈ రంగంలో విద్యుత్తు గిరాకీ 2025–35 మధ్య ఏటా సగటున 18% పెరుగుతుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ అంచనా వేసింది.

## ఈ నెలలోనే జియో ఐపీఓ..

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్ మెగా ఐపీఓకు సన్నద్ధమవుతోంది. సుమారు రూ.37 వేల కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో.. అక్టోబర్‌లోనే ఐపీఓకు రానున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. కథనాల ప్రకారం.. జియో ఐపీఓ అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 23న ముగియనుంది. అక్టోబర్ 19న యాంకర్ ఇన్వెస్టర్ల బుకింగ్ ప్రారంభం కానుంది. కంపెనీ షేర్లు అక్టోబర్ 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. మార్కెట్ పరిస్థితులను బట్టి ఈ తేదీల్లో మార్పులు ఉండొచ్చని సదరు కథనాలు తెలిపాయి. పబ్లిక్ ఇష్యూలో 27 కోట్ల తాజా షేర్లను (కంపెనీలో 2.9% వాటాకు సమానం) కంపెనీ జారీ చేయనుంది. ఐపీఓ ద్వారా రూ.37,700 కోట్లు రావొచ్చని జియో అంచనా వేస్తోంది. పబ్లిక్ ఇష్యూ నిధులను జియో ప్లాట్‌ఫామ్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు చెందిన దాదాపు రూ.27,500 కోట్ల రుణాల చెల్లింపునకు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించనుంది.









## పత్తి పంటలో గంజాయి సాగు

### 51 గంజాయి మొక్కలు స్వాధీనం.. ఒకరి అరెస్ట్

నేరడిగొండ అక్టోబర్3(జనంసాక్షి): అక్రమంగా గంజాయి సాగు,విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ రూరల్ సిఐ సిహెచ్ రమేష్ హెచ్చరించారు.శనివారం రోజున మండలంలోని అరేపల్లి గ్రామ శివారులోని (ఆర్ఓ ఎఫ్ఆర్) పట్టా వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మొత్తం 51 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో అరేపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమి లో తనిఖీలు నిర్వహించారు. పోలీసులను గమనించిన ఒక వ్యక్తి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో అతడిని సిడాం గంగారాం(60) అరేపల్లి గ్రామం,నేరడిగొండ మండలంగా గుర్తించారు. నిందితుడి పేరుపై ఉన్న ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూమిలో పత్తి పంట మధ్యలో గంజాయి మొక్కలను అంతర పంటగా రహస్యంగా సాగు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.భూమిలో సుమారు 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 51 గంజాయి మొక్కలను గుర్తించి వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారురూ.5,10,000/- ఉంటుందని తెలిపారు. గంజాయి మొక్కలను సీజ్ చేసి నేరడిగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.అక్రమంగా గంజాయి సాగు,విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచోడ రూరల్ సీఐ సి హెచ్ రమేష్ హెచ్చరించారు.గంజాయి సాగు అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే నేరుగా జిల్లా ఎస్పీ కి 8712659973 నంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారంఅందించవచ్చు,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగాఉంచబడతాయని తెలిపారు.గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు.

## డీమార్ట్ ఆదాయం రూ.19,206 కోట్లు

ప్రధాన రిటెయిల్ వ్యాపార సంస్థ డీమార్ట్ ఈ ఏడాది రెండో త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది జులై– సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.19,206.18 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.16,218.79 కోట్లతో పోలిస్తే 18.4 శాతం అధికం. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంతో పోలిస్తే.. డీమార్ట్ ఆదాయం 4.7 శాతం వృద్ధిని నమోదు చేసింది.

### అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్..

## స్మార్ట్‌ఫోన్స్‌పై భారీ డీల్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ డీల్స్‌కు సిద్ధమవుతోన్న అమెజాన్ ఒక్కో ఆఫర్‌ను ప్రకటిస్తోంది. అక్టోబర్ 8 నుంచి ఈ మెగా సేల్ ప్రారంభం కానుంది తాజాగా స్మార్ట్‌ఫోన్లపై ఆఫర్లను తన మైక్రోసైట్‌లో వెల్లడించింది. ఇందులో గెలాక్సీ ఎస్25 అల్ట్రా, ఐఫోన్ 16, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ వంటి స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. అన్ని బ్యాంకులు, కూపన్ ఆఫర్లతో కలుపుకోని డిస్కౌంట్‌లను రివీల్ చేసింది. ఎంపిక చేసిన ఫోన్లపై ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. మరికొన్ని స్మార్ట్‌ఫోన్ల ఆఫర్లను వెల్లడించాల్సి ఉంది.

స్మార్ట్‌ఫోన్ డీల్స్ ఇలా..

శాంసంగ్ గెలాక్సీ ఎస్2 అల్ట్రా 5జీ ధర ప్రస్తుతం రూ.99,999గా ఉండగా.. ఆఫర్లో రూ.84,999 నుంచే ప్రారంభం కానుంది.ఐఫోన్ 16 ధర రూ.89,900 కాగా.. డిస్కౌంట్ అనంతరం రూ.71,999కు లభిస్తోంది. గెలాక్సీ ఏ56 5జీ స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.31,999గా నిర్ణయించింది. వన్‌ప్లస్ నార్డ్ సీఈ6 ధర రూ.40,999 కాగా.. ఆఫర్లో రూ.33,999కు లభిస్తుంది. ఆరు నెలల ఈఎంఐ సదుపాయం ఉంది. ఐకూ జెడ్11 ఎక్స్‌ఏ ధర రూ.40,999 ఉండగా.. పండగ డీల్స్‌లో రూ.24,999కు లభిస్తుంది.రెడ్‌మీ 15సీ 5జీ ప్రైమ్ ధర రూ.29,999 కాగా డిస్కౌంట్ అనంతరం రూ.15,999కు లభిస్తుంది. గెలాక్సీ ఎం17ఈ 5జీ ధర రూ.16,999 నుంచి ప్రారంభమవుతుంది. వన్‌ప్లస్ నార్డ్ 6 ధర రూ.52,999 ఉండగా.. డిస్కౌంట్‌లో రూ.42,999కు కొనుగోలు చేయొచ్చు.





# రామప్ప శిల్పవైభవానికి విదేశీ ప్రతినిధుల ప్రశంసలు

**కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం అద్భుతమని కొనియాడిన బృందం**

**వెంకటాపూర్(రామప్ప),అక్టోబర్03(జనంసాక్షి):** ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్పవైభవంపై విదేశీ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు.కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 18 దేశాలకు చెందిన 28 మంది విదేశీ అధికారులు, పాత్రికేయులతో కూడిన బృందం శనివారం ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం కింద హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ రెండు వారాల సామర్థ్య వికాస శిక్షణను నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 10 వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణలో భాగంగా ప్రతినిధుల బృందం అధ్యయన పర్యటన చేపట్టింది. అల్జీరియా,భూటాన్,కాంబోడియా, ఈక్వడార్,ఫిజీ,ఘనా,లైబీరియా, మాల్దీవులు, మారిషస్,మొజాంబిక్,సీషెల్స్, సియెర్రా లియోన్, శ్రీలంక,టోగో,ఉజ్బెకిస్తాన్, వియత్నాం,జాంబి యా,జింబాబ్వే దేశాలకు చెందిన అధికారులు,పాత్రికే యులు ఈ బృందంలో ఉన్నారు.రామప్ప దేవాలయ సందర్శన సందర్భంగా ఆలయ విశిష్టత, ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రాధాన్యం, శిల్పుల నైపుణ్యం,నిర్మాణ పద్ధతులను టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ విదేశీ ప్రతినిధులకు వివరించారు. భూకంపాలను తట్టుకునేలా ఇసుక పునాది సాంకేతికతను వినియోగిం చడం, ఆలయ గోపుర నిర్మాణంలో బరువును తగ్గించేందుకు నీటిపై తేలే తేలికపాటి ఇటుకలను ఉపయోగించడం వంటి కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం బృంద సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది.నల్లరాతిపై సున్నితమైన నగిషీలతో చెక్కిన నిలువెత్తు శిల్పాలను, నాట్య భంగిమలతో కూడిన శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. సూది బెజ్జం దూరేంత సన్నని రంధ్రాలు కలిగిన శిల్పకళను ఆసక్తిగా తిలకించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు వెలుగు మారినా గర్భగుడిలోని శివలింగంపై ఒకే విధంగా వెలుగు పడేలా చేసిన కాకతీయుల ఖగోళ, వాస్తు నైపుణ్యాన్ని కొనియాడారు. ప్రతి శిల్పం ఆనాటి శిల్పుల ప్రతిభను, భారతీయ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పే లా ఉందని ప్రశంసించారు. కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ శైలి, కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్యటన సమన్వయ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, పర్యాటక సమన్వయ అధికారి ధర్మా నాయక్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫిసర కుసుమ సూర్య కిరణ్,సంబంధిత అధికారులు, టూరీస్ట్ పోలిస్ లు తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

### ప్రధాన నిందితుడు అరెస్ట్

### ప్రెస్ మీట్ లో డీఎస్పీ సంపత్ రావు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి):** పేదల కడుపు కొట్టి కోట్లు కొల్లగొడుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా సిండికేట్ గుట్టును భూపాలపల్లి పోలీసులు రట్టు చేశారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భూపాలపల్లికి చెందిన నిందితుడు మోటం శ్రీనివాస్ (32) గత రెండు మూడు సంవత్సరాలుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు చెప్పారు. మే, జూన్, జూలై నెలల్లో భూపాలపల్లి, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 10–15 మందిని ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా పేదల వద్ద నుండి కిలోకు రూ. 12ల చొప్పున సుమారు 3400 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేయించి, మహారాష్ట్రలోని రైస్ మిల్లుకు తరలించి విక్రయించినట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. ఈ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా సంఘటనలో ప్రధాన నిందితుడు అరెస్టు చేయడంతో పాటు ఏజెంట్లుగా వ్యవహరించిన మరో 14మందిపై కేసు నమోదు చేసి, వారి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో భూపాలపల్లి సీఐ శ్రీనివాస్, ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.





## గోదావరి తీరంలో ఇసుక మాఫియాకు రెవెన్యూ శాఖ 'చెక్'..

### ఇసుక దందాను అరికట్టేందుకు ప్రత్యేక సీసీ కెమెరాల ఏర్పాటు

**కడెం, అక్టోబర్ 03 (జనంసాక్షి):** కడెం మండలంలోని బెల్లాల గ్రామ పొలిమేర గుండా ప్రవహించే గోదావరి నది తీరం అక్రమ ఇసుక రవాణాదారులకు ప్రధాన అడ్డాగా మారింది. నది తీరంలో భారీగా పేరుకుపోయిన ఇసుక తెప్పలను ఆసరాగా చేసుకుని ఇసుక మాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోతోంది. ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన ఇసుక వనరులను నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతూ, విక్రయిస్తూ అక్రమార్కులు లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. నదీ గర్భంలో యంత్రాలతో భారీ గోతులు తవ్వుతూ పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తుండటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అక్రమ రవాణాను ఎలాగైనా అడ్డుకోవాలనే లక్ష్యంతో గతంలో రెవెన్యూ శాఖ అధికారులు గోదావరి లోపలికి వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద కందకాన్ని తవ్వించారు. అయితే, అధికారుల హెచ్చరికలను కూడా లెక్కచేయని ఇసుక అక్రమార్కులు రాత్రికి రాత్రే ఆ కందకాన్ని మట్టితో నింపి పూడ్చేసి, తమ అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగించారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు కఠిన చర్యలకు ఉపక్రమించారు. తహసిల్దార్ కాజా మొహినుద్దీన్ ఆదేశాల మేరకు ఆర్ఐ శారద నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది శనివారం గోదావరి దారి వద్దకు చేరుకుని, అక్రమార్కుల కదలికలను ప్రతిక్షణం పసిగట్టేందుకు ప్రత్యేక సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ శారద మాట్లాడుతూ... "నదీ తీరంలో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ ఇసుకను తరలిస్తే ఇకపై సహించేది లేదని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, నది ఒడ్డున విక్రయించడానికి సిద్ధంగా గుట్టలుగా పోసి ఉంచిన అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై కూడా తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని రెవెన్యూ యంత్రాంగం హెచ్చరించింది.

## అర్హులైన ఏ ఒక్క ఓటరూ హక్కు కోల్పోకూడదు

### రాష్ట్ర ఎన్నికల పరిశీలికురాలు శ్రీదేవి




**నిర్మల్ బ్యూరో,అక్టోబర్ (జనంసాక్షి)** అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పో కుండా ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించారు.బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని, తొలగించిన ఓట్లకు కారణాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. ఫారం–6పై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రచారం నిర్వహించాలని సూచించారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. అనంతరం కస్బా, న్యూ పోచంపాడ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు పరిశీలించి బీఎల్ఓల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌సీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల సత్తా

- ఒకరికి బంగారు పతకం.. ముగ్గురికి వెండి పతకాలు
- రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



దిలావర్‌పూర్(జనం సాక్షి): ఎస్‌సీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కేజీబీవీ దిలావర్‌పూర్ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు.ద్వితీయ సంవత్సరం విద్యార్థిని యు. పల్లవి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. పదో తరగతికి చెందిన కె. దివ్య, జి. అక్షయ, ఎం. వాసవి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలను సాధించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అపర్ణ, పీఈటీ జయ, ఉపాధ్యాయ బృందం, బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చందుల స్వామి అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి పాఠశాలకు, దిలావర్‌పూర్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వనజీవి రామయ్య అందరికీ ఆదర్శం

### కమిషనర్ దివ్య , వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నరేష్ కుమార్



**బచ్చన్నపేట (జనంసాక్షి):** వనజీవి రామయ్య అందరికీ ఆదర్శమని ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ దివ్య. వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్ అన్నారు. శనివారం వనజీవి రామయ్య జీవిత స్ఫూర్తిని, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేసేందుకు రూపొందించిన వనజీవి ఫిలింను గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించే అంశంపై పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ దివ్య ను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్, చిత్ర నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వనజీవి రామయ్య జీవిత స్ఫూర్తిని తెలియజేసే చిత్రాన్ని ప్రదర్శించేందుకు చేపడుతున్న కార్యక్రమం గురించి కమిషనర్ దివ్యకు వివరించామని. ఈ అంశంపై దివ్య సానుకూలంగా స్పందిస్తూ, వనజీవి రామయ్య పర్యావరణ సేవలను ప్రశంసించారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ ఎస్ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీ లక్ష్మి , డైరెక్టర్ వేముగంటి, ఫౌండేషన్ సభ్యులు తరిగొప్పుల నవీన్ కుమార్ ఉన్నారు

# ఆర్టీఐ సమాచారం ఇవ్వకపోవడంపై కమిషన్ ఆగ్రహం

- రామగుండం కార్పొరేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి
- ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట ప్రకారం ఇవ్వాలి
- మరో 15 రోజుల గడువు.. సమాచారం ఇవ్వకుంటే షోకాజ్ నోటీసులు
- ఆర్టీఐని నిర్వీర్యం చేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిక




**గోదావరిఖని, అక్టోబర్ 3 (జనం సాక్షి):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహించడంపై తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు. కార్పొరేషన్‌లోని వివిధ నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌పై శనివారం సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో విచారణ జరిగింది. దినేష్ విచారణకు హాజరై తన వాదనలు వినిపించారు.
ఆర్టీఐ చట్టం కింద నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రామగుండం కార్పొరేషన్ అధికారులు స్పందించలేదని దినేష్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తొలుత సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో మొదటి అప్పీల్ దాఖలు చేసినట్లు తెలిపారు. అయినా సమాచారం అందించలేదని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని విచారణ సందర్భంగా ప్రశ్నించిన ట్లు తెలిపారు. ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించిన హక్కును అధికారులు గౌరవిం చాలని కమిషన్ స్పష్టం చేసినట్లు దినేష్ తెలిపారు. ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం అందించడం సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఆర్టీఐ చట్టం కీలకమని, ప్రజా సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని దాచకుండా అందుబాటులో ఉంచాలని కమిషన్ సూచించినట్లు తెలిపారు.

డిసెంబర్ 25న సమాచారం కోరిన దరఖాస్తుకు చట్ట ప్రకారం 30 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అధికారులు స్పందించలేదని విచారణలో కమిషన్ పేర్కొన్నట్లు దినేష్ తెలిపారు. మొదటి అప్పీల్ అనంతరం కూడా సమాచారం అందించకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. మరో 15 రోజుల గడువు ఇస్తున్నామని, ఈ వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. గడువులో సమాచారం ఇవ్వకపోతే కార్పొరేషన్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు చట్ట ప్రకారం జరిమానా విధించే చర్యలు ఉంటాయని కమిషన్ హెచ్చరించినట్లు దినేష్ వెల్లడించారు.

# సోలార్ విద్యుత్ వాడకమే భవితకు రక్ష

- రాబోయే రోజుల్లో కరిగిపోనున్న బొగ్గు, నీటి నిల్వలు
- సౌరశక్తి వైపు ప్రతి ఒక్కరూ మళ్లాలి : కరీంనగర్ ట్రాన్స్‌కో ఎస్ఈ విజయేందర్ రెడ్డి



**హుజూరాబాద్, అక్టోబర్ 3 (జనంసాక్షి ) :** భవిష్యత్ తరాల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సౌర (సోలార్) విద్యుత్ వినియోగం వైపు మళ్లాలని కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో 'శివ బాలాజీ సోలార్ ఏజెన్సీ' ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సాంప్రదాయ విద్యుత్ వనరులైన బొగ్గు, నీటి నిల్వలు భవిష్యత్తులో క్రమంగా అడుగంటి తీవ్ర ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన సూర్యరశ్మి తరగని సంపద అని, భూమి ఉన్నంత కాలం లభించే ఈ సౌరశక్తిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ కొరతను అధిగమించవచ్చని స్పష్టం చేశారు. సౌర విద్యుత్ వినియోగంపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, పరిసరాల ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలని ఆయన సూచించారు. ప్రజా ప్రయోజనార్థం ఇలాంటి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిన శివ బాలాజీ సోలార్ ఏజెన్సీ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సదస్సులో పట్టణ ప్రముఖులు, స్థానిక ప్రజలు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు రోడ్డు ప్రమాదాలు.. ఇద్దరు వృద్ధుల మృతి

**హయత్‌నగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి):** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. అయ్యప్ప కాలనీకి చెందిన రెగుచింతల బాలరాజు (62) శుక్రవారం రాత్రి 11.10 గంటల సమయంలో హయత్‌నగర్ బస్‌స్టేషన్ వైపు కాలినడకన వెళ్తుండగా, పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో న్యూ రాక్‌టౌన్ కాలనీకి చెందిన మేక రవీందర్‌రెడ్డి (66) అక్టోబర్ 2న సాయంత్రం కృష్ణవేణి ఆసుపత్రి సమీపంలో రోడ్డు దాటుతుండగా హోండా షైన్ బైక్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన ఆయన పై నుంచి వెనుకగా వచ్చిన గుర్తుతెలియని ఎర్టిగా కారు వెళ్లింది. సుమారు ఐదు మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు ఘటనలపై హయత్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదాల కు కారణమైన వాహనాలు, వాటి డ్రైవర్లను గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు.

## డంపింగ్ యార్డులో విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి



**కాప్రా, అక్టోబర్ 3 (జనం సాక్షి):** కాప్రా సర్కిల్ పరిధిలోని రామ్‌కీ సాజెట్ డంపింగ్ యార్డులో బిన్ బిన్ మెషిన్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై శివ మృతి చెందిన ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు నిరసనగా డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఘటన జరిగిందని ఆరోపిస్తూ, కారణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. శివ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి లేదా జీవనోపాధికి భరోసా కల్పించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్, బిన్ బిన్ మెషిన్ నిర్వహణ సంస్థ ప్రతినిధులు, ఇతర బాధ్యుల పాత్రపై విచారణ జరిపి తప్పిదాలు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు.
డంపింగ్ యార్డులోని యంత్రాలు, విద్యుత్ వ్యవస్థలు, వైరింగ్, ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను తక్షణమే పరిశీలించి లోపాలను సరి చేయాలని సూచించారు. కార్మికులకు రక్షణ పరికరాలు, అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా కల్పించాలని అన్నారు. శివ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, అధికారులు స్పందించకపోతే హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా చేపడతామని బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

# పారదర్శక ఓటరు జాబితాకు పకడ్బందీగా ఎస్ఐఆర్

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి
- అనర్హులకు చోటులేకుండా జాబితా సవరణ
- అన్‌మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లపై సమగ్ర నివేదిక
- హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3 (జనం సాక్షి):** అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా తుది ఓటరు జాబితా రూపొందించాలని ఎన్నికల జాబితా పరిశీలకులు, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులు టీ.కే.శ్రీదేవి సూచించారు. అర్హులైన వారి పేర్లు తప్పిపోకుండా, అనర్హులకు చోటు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్మూర్ నియోజకవర్గంలోని మామిడిపల్లి 39వ, ఆర్మూర్ 88వ పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాతో కలిసి పరిశీలించారు. ఎస్ఐఆర్ అమలు, రిజిస్టర్ల నిర్వహణ, నోటీసులు, పూర్తయిన హియరింగ్‌లు, ధ్రువీకరణ పత్రాలు, అన్‌మ్యాపింగ్, అనామలీస్ ఓటర్ల వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని తెలుసుకున్న శ్రీదేవి.. నిజామాబాద్ అర్బన్‌తో పాటు కొన్ని నియోజకవర్గాల్లో అన్‌మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లు అధికంగా ఉండటంపై కారణాలను కేటగిరీల వారీగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, బీఎల్‌ఓల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఈఆర్‌ఓలకు సూచించారు. డిజిటలైజేషన్‌ను వేగవంతం చేస్తూనే తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలు సమయపాలన పాటిస్తూ ఓటర్లకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఎస్ఐఆర్‌లో క్రియాశీలకంగా పాల్గొని, తప్పిదాలు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం రావాలి

- నేర రహిత కమిషనరేట్‌గా మార్చేందుకు పోలీసుల కృషి
- 2017-2026 సెప్టెంబరు వరకు 10,991 కెమెరాల ఏర్పాటు
- నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- నేరాల ఛేదన, ఆస్తుల రికవరీలో కీలక ఆధారం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):** నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తున్నందున ప్రజల్లో వాటి ఏర్పాటుపై చైతన్యం రావాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో అవసరమైన చోట నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నేరాలు జరిగిన తర్వాత బాధపడటం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు.
సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా నిందితులను త్వరగా గుర్తించడంతోపాటు చోరీకి గురైన ఆస్తులను రికవరీ చేయడానికి, ఘటనలకు సంబంధించిన ఆధారాలను సేకరించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మహిళలపై వేధింపులు, వాహనాల చోరీ, దాడులు వంటి ఘటనలను నియంత్రించడంలోనూ ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. బ్యాంకులు, ఏటీఎంలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, సినిమా థియేటర్లు వంటి ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించినట్లవుతుందని కమిషనర్ అన్నారు. సీసీ కెమెరాల ద్వారా లభించే దృశ్యాలు కోర్టు కేసుల్లోనూ ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్, 'నేను సైతం' కార్యక్రమాల కింద 2017 నుంచి 2026 సెప్టెంబరు వరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 10,991 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీపీ సాయి చైతన్య వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతో నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి : సీపీఐ

**గన్నేరువరం:** మండలంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరు ల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి అసం పూర్తిగా వదిలేసిన ఇళ్లను పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని, మండల వ్యాప్తంగా అర్హులను ఇళ్లు అందజేయాలని కోరారు. ఈ డిమాండ్‌తో ఈ నెల 6వ తేదీ (మంగళవారం) మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

- వారి మనస్తత్వాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలి : జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 03 (జనం సాక్షి);** విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యా యులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కుని టీఆర్ఎస్ఎంఏ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయు లేనని, వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిం చాలని ఎస్పీ సూచించారు. విద్యార్థులు తమ సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకునేలా పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా బాధ్యతాయుత వినియోగం పై అవగాహన కల్పించా లని తెలిపారు. ఆపదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో షీ టీమ్ ఆధ్వర్యంలో గుడ్ టచ్--బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, డీటీవో శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎగువ మానేరు నీటిని విడుదల చేయాలి

**కాలువలకు నీరు ఇవ్వాలని రైతుల రాస్తారోకో.. అధికారుల స్పందన**

గంభీరావుపేట, ఆగస్టు 3, జనం సాక్షి: ఎగువ మానేరు పరివాహక ప్రాంత రైతులు పంటలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో రైతులు సిద్దిపేట--కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎగువ మానేరు నిండుకుండలా ఉన్నప్పటికీ వరి పంట నిండు పొట్ట దశలో ఉందని, మానేరు కుడి, ఎడమ కాలువలకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "కలెక్టర్ రావాలి.. నీటిని విడుదల చేయాలి" అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దార్ మారుతి రెడ్డి, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అధికారులు నచ్చజెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.
అధికారుల ఆదేశాలతో నీటి విడుదల: రైతుల ఆందోళనకు అధికారులు వెంటనే స్పందించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎగువ మానేరు నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో పంటలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు

- రూ.1.93 కోట్ల విలువైన 387.128 కిలోల గంజాయి కేసు
- తాజాగా మరో ముగ్గురిపై పీడీ యాక్ట్ అమలు
- పనసపండ్ల మాటున గంజాయి తరలిస్తుండగా పట్టివేత
- డ్రగ్స్ రవాణాపై నిరంతరం నిఘా, ప్రత్యేక తనిఖీలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3 (జనం సాక్షి):** యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులను ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రూ.1.93 కోట్ల విలువైన 387.128 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో తాజాగా మరో ముగ్గురిపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు ఏడుగురిపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు తెలిపారు. 2026 జూన్ 20న ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దేవునిపల్లి పోలీసులు జాతీయ రహదారి-44పై తనిఖీలు చేపట్టారు. క్యాసంపల్లి శివారులోని రాయల్ ధాబా సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా, పైభాగంలో పనసపండ్లు ఉంచి వాటి కింద సంచుల్లో గంజాయిని దాచి తరలిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 387.128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దాని విలువ రూ.1,93,56,400గా పోలీసులు అంచనా వేశారు. తాజాగా నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా అలియాస్ షేక్ కరీం (41), గైని సుభాష్ (35), షేక్ రహీమ్ (59)పై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా గొలుసు, నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో డ్రగ్స్ రవాణాపై ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు, నాకాబందీలు, ప్రత్యేక పోలీసు ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల రవాణా, సరఫరా, నిల్వలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వెల్జీపురం సబ్‌స్టేషన్‌కు రూ.3.76 కోట్లు మంజూరు

- 20 ఏళ్ల లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం



**ఇల్లంతకుంట, అక్టోబర్ 03 (జనంసాక్షి):** మండలం వెల్జీపురం, ఓబులాపురం, చిక్కుడువానిపల్లె, రామోజీపేట గ్రామాల రైతులు గత 20 ఏళ్లుగా ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించనుంది. నాలుగు గ్రామాల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెల్జీపురంలో రూ.3.76 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవతో సబ్‌స్టేషన్ మంజూరు ప్రక్రియ పూర్తయింది. ఎన్పీడీసీఎల్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో ప్రతిపాదనకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి సబ్‌స్టేషన్‌కు రూ.3.76 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు లభించింది. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో వెల్జీపురంతో పాటు ఓబులాపురం, చిక్కుడువానిపల్లె, రామోజీపేట గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఏర్పడింది. ఈ మేరకు హైదరాబాద్ సెక్రటేరియట్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సబ్‌స్టేషన్ మంజూరు పత్రాన్ని వెల్జీపురం సర్పంచ్ నాయిని నవీన్ కుమార్‌కు అందజేశారు. సబ్‌స్టేషన్ మంజూరుతో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు, రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులకు సబ్‌స్టేషన్ మంజూరు ఉపశమనం కలిగించనుందని గ్రామస్తులు పేర్కొన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా మెరుగుపడితే సాగు సమయంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ గుండా వెంకటేశం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

# డిజైన్‌కే నాలుగు నెలలైతే నిర్మాణానికి ఎన్నేళ్లు?

- మంథని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులపై పుట్ట మధూకర్ విమర్శలు
- మార్కెట్‌ను కూల్చి నాలుగు నెలలైనా పనులు ప్రారంభించలేదని ఆరోపణ
- పుష్కరాల్లోగా మార్కెట్ పూర్తికాకపోతే చిరువ్యాపారులకు నష్టమే
- జాప్యానికి పాలకులు, అధికార యంత్రాంగం సమాధానం చెప్పాలి




**మంథని, అక్టోబర్ 3 (జనం సాక్షి):** మంథనిలో నూతన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శనివారం నూతన మార్కెట్ నిర్మాణ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడి పనుల జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మంథని చారిత్రక ఆనవాళ్లు లేకుండా చేయాలన్నదే పాలకుల ఆలోచనగా కనిపిస్తోందని విమర్శించారు.
నాలుగు నెలల క్రితం మార్కెట్ నిర్మాణం కోసం పాత మార్కెట్‌ను తొలగించినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్లకే నాలుగు నెలలు సమయం పట్టిందని అధికారులు చెబుతున్నారని, డిజైన్‌కే ఇంత సమయం పడితే నిర్మాణం పూర్తయ్యేందుకు ఎన్నేళ్లు పడుతుందో పాలకులు, అధికార యంత్రాంగం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
మంథని మార్కెట్‌కు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉందని, పట్టణంతో పాటు స్థానిక చిరువ్యాపారుల జీవనోపాధితో అది ముడిపడి ఉందని పుట్ట మధూకర్ అన్నారు. మార్కెట్ లేకపోవడంతో కూరగాయలు, మాంసం విక్రయించే చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన చిరువ్యాపారులపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కాటారం మార్కెట్‌ను పరిశీలించానని, అక్కడ కూడా వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అప్పటిలోగా మార్కెట్ నిర్మాణం పూర్తి కాకపోతే చిరువ్యాపారులకు మరింత నష్టం వాటిల్లుతుందని పుట్ట మధూకర్ అన్నారు. శిలాఫలకం వేసి రెండేళ్లు కావస్తున్నా పనులు ముందుకు సాగకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంథని ప్రజల అవసరాలు, భవిష్యత్ తరాల సమస్యలు, మౌలిక వసతులపై పాలకులు దృష్టి సారించాలని సూచించారు. తన కుటుంబానికి ఈ మార్కెట్‌తో చిన్నప్పటి నుంచే అనుబంధం ఉందని, తన తండ్రి ఇక్కడే గొడ్ల అంగడి నిర్వహించేవారని పుట్ట మధూకర్ తెలిపారు. అందుకే మార్కెట్ పరిస్థితిపై స్పందిస్తున్నానన్నారు. తండ్రి ఆశయాలను పదేపదే ప్రస్తావించే ఎమ్మెల్యే.. ప్రజలను, చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మార్కెట్ పనులు ఎందుకు ప్రారంభించలేదో పాలకులు, అధికారులు ప్రజలకు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రతి విద్యార్థి మంచిగా చదవాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆటలు ఆడాలి..అన్ని రంగాల్లో రాణించాలి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 03 (జనం సాక్షి);** ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని,తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మహాత్మా జ్యోతి బాపూలే విద్యాలయాన్ని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ రూమ్ లో బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి,ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. ఈ రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించారా అని ఆరా తీశారు. నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్, ప్రతి రోజూ గుడ్డు ఇస్తున్నారా అడిగి తెలుసుకున్నారు.ఆర్ఓ ప్లాంట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని,దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశానికి చాలా మంది పోటీ పడతారని, మంచి అవకాశం వచ్చిందని, వినియోగించు కోవాలని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, దీనిని పరిశీలించేందుకు ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ కోసం ఒక మండల స్థాయి అధికారులను కేటాయించామని వివరించారు. వారు విద్యాలయం తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.తరగతి గదులు, వసతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. విద్యార్థులు రోజూ ఆటలు ఆడాలని,సంగీతం, డ్యాన్స్ నచ్చిన విభాగంలో ఉండాలని సూచించారు. మంచిగా చదివి తమ ప్రాంత విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# కోడలే కూతురైంది.. 'లీగల్'గా దోచేశారు

## రెవెన్యూ కార్యాలయంలో పత్రాల గారడీ

- బ్యాంకు నిధులు, పెన్షన్‌పై కన్ను
- పోలీసులు, తహసీల్దార్‌కు బాధితుల మొర




**మధిర, అక్టోబర్ 3 (జనంసాక్షి):** జీవితాంతం విద్యాబుద్ధులు నేర్పిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి మరణం తర్వాత, ఆయన కుటుంబంలో అక్రమాల చిచ్చు రేగింది. అధికార యంత్రాంగం నిబంధనలను తుంగలో తొక్కి జారీ చేసిన ఒక ధ్రువీకరణ పత్రం.. అసలైన వారసుల కడుపుకోతకు కారణమైంది. ఖమ్మం జిల్లా మధిర మండలం జిలుగుమాడు గ్రామానికి చెందిన విశ్రాంత హిందీ పండిట్ దివంగత నల్లగట్ల సీతారామయ్య 'లీగల్ హెయిర్ సర్టిఫికెట్' (వారసత్వ ధ్రువీకరణ పత్రం) జారీ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.

**కోడల్ని కూతురిగా మార్చేశారు**

సీతారామయ్య ఇటీవల కన్నుమూయగా, ఆయన రెండో కోడలు నల్లగట్ల త్రివేణి (దివంగత నల్లగట్ల వెంకట రమణ భార్య)ని ఏకంగా ఆయన సొంత కుమార్తెగా చూపిస్తూ రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రం జారీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది. క్షేత్రస్థాయి విచారణ, కుటుంబ రికార్డులను కనీసం పరిశీలించకుండానే కోడలిని కూతురిగా ఎలా నమోదు చేశారంటూ మృతుడి అసలైన కుమారుడు, కుమార్తెలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లక్ష్యం.. బ్యాంకు ఖాతాలు, పెన్షన్ సొమ్ము**

ఈ అక్రమ సర్టిఫికెట్ వెనుక పక్కా ఆర్థిక ప్రణాళిక దాగి ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. సీతారామయ్య బ్యాంకు ఖాతాలో దాచుకున్న సొమ్మును కాజేసేందుకు, ఆయన గతంలో పనిచేసిన పాఠశాల నుంచి అందాల్సిన వారసత్వ ఫ్యామిలీ పెన్షన్‌ను చేజిక్కించుకునేందుకే ఈ తప్పుడు పత్రాలను సృష్టించారని మండిపడుతున్నారు. వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయకుండానే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) సైతం దరఖాస్తును పై అధికారులకు ఫార్వర్డ్ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

తప్పుడు వివరాలు సమర్పించి సర్టిఫికెట్ పొందిన నల్లగట్ల త్రివేణితో పాటు, ఈ కుట్రలో కీలక పాత్ర పోషించినట్లుగా చెబుతున్న ఆమె కుమారుడు సాయి ప్రణీత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి పెద్ద కుమారుడు, కుమార్తెలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధిర తహసీల్దార్ కార్యాలయంతో పాటు స్థానిక పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తక్షణమే సంబంధిత బ్యాంకు లావాదేవీలు, పెన్షన్ ప్రక్రియను నిలిపివేసి.. రెవెన్యూ, పాఠశాల, బ్యాంకు రికార్డులను సమగ్రంగా పరిశీలించి తమకు న్యాయం చేయాలని నిష్పక్షపాత విచారణ కోరుతున్నారు. ఈ విషయం పై మధిర తహసిల్దార్ రాంబాబు ని వివరణ అడగగా దీనిపై రీ ఎంక్వయిరీ వేశామని, ఎంక్వయిరీలో తప్పుడు ధృవీకరణ పై చర్యలు ఉంటాయని, అట్టివారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు.



'భార్య సర్పంచ్.. భర్త పెత్తనం' అన్న ఆరోపణలు మంచాల మండల పరిషత్ సమావేశంలో తీవ్ర చర్చకు దారితీశాయి. మహిళా సర్పంచులు ఎన్నికై ఉన్నప్పటికీ వారి భర్తలు సమావేశాలకు హాజరవుతూ అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు మాత్రమే దక్కాల్సిన అధికారిక వేదికపై రాజకీయ పార్టీ నాయకులు, సర్పంచుల భర్తలు హాజరై పెత్తనం చెలాయించడం ఏమిటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా అనధికార వ్యక్తులు సమావేశాల్లో పాల్గొంటే ప్రజాప్రతినిధుల హక్కులు, సమావేశం గౌరవం దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఈ అంశంపై సభ్యుల మధ్య తీవ్ర చర్చ జరగడంతో కొంతసేపు సమావేశ వాతావరణం వేడెక్కింది.

# భార్య సర్పంచ్.. భర్త పెత్తనం

## మండల సభలకు భర్తలే హాజరు

- మండల పరిషత్ సమావేశంలో సర్పంచుల భర్తలు, పార్టీ నేతల హాజరుపై అభ్యంతరాలు
- ఎన్నికైన ప్రజాప్రతినిధులకే సమావేశాల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో స్పష్టీకరణ
- మంచాల మండల అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు: ఎమ్మెల్యే



**మంచాల, అక్టోబరు 3 (జనం సాక్షి):**
మంచాల మండల పరిషత్ సమావేశంలో సర్పంచుల భర్తలు, రాజకీయ పార్టీ నాయకుల జోక్యంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికైన మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలు సమావేశాలకు హాజరై పెత్తనం చెలాయిస్తున్నారంటూ కొందరు సభ్యులు ఆరోపించారు. అధికారిక సమావేశాలకు నిబంధనల ప్రకారం సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే హాజరు కావాల్సి ఉండగా, ఇతరుల పాల్గొనడం వల్ల సమావేశం నిర్వహణ, అధికారిక ప్రోటోకాల్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంపై కొందరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయగా, సమావేశంలో వాగ్వాద పరిస్థితులు ఏర్పడినట్లు తెలిసింది. పార్టీ నాయకులు సైతం సమావేశాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని సభ్యులు పేర్కొన్నారు. అనుమతి లేకుండా సమావేశాలకు హాజరయ్యే వ్యక్తులను నియంత్రించేందుకు ఇప్పటికే హెచ్చరించినప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదని ఎంపీడీవో వసంతలక్ష్మి తెలిపారు. ఇకపై మండల పరిషత్ అధికారిక సమావేశాల్లో నిబంధనలు, ప్రోటోకాల్ కచ్చితంగా అమలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు మాత్రమే సమావేశాల్లో తగిన ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
మరోవైపు మండల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపైనా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అధికారులు వారధిగా పనిచేయాలని, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాల ని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనుల వివరాలను పక్కాగా నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
మంచాల మండల అభివృద్ధికి ప్రభుత్వం రూ.66 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.3 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అరుట్లలో టీపీఎస్ ఏర్పాటు, విద్యాకేంద్రం అభివృద్ధి, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై కూడా సమీక్షించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రోటోకాల్, ప్రజాప్రతినిధుల పాత్రతోపాటు మండల సమగ్రఅభివృద్ధికి సంబంధించిన పలుఅంశాలు చర్చకు వచ్చాయి.

# ఇది వికారాబాద్ పెద్ద ఆస్పత్రుల దుస్థితి

- విరిగిన స్ట్రెక్చర్.. వీల్ చైర్ లేక అవస్థలు
- కాలినడకన తీవ్రంగా గాయపడిన క్షేత్ర గాత్రులు
- సంఘటన జరిగినప్పుడే వెలుగులోకి వస్తున్న నిజాలు




**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్3 (జనం సాక్షి):** పైన మెరుగు... లోన పురుగు అన్నట్లు ఉంది సర్కార్ ఆస్పత్రుల పరిస్థితి. ఏదైనా దారుణ సంఘటన జరిగినప్పుడు తప్ప మిగతా సమయంలో ఆస్పత్రుల పనితీరు వాటి దుస్థితి బయటకు రాదు. అందుకు ఉదాహరణంగానే శనివారం నాడు జరిగిన సంఘటనను పేర్కొనవచ్చు. వికారాబాద్ అనంతగిరి ఘాట్ సెక్షన్ లో జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షేత్రగ్రాత్రులను అంబులెన్స్ లో నుంచి దింపి ఆసుపత్రిలోకి తీసుకు వెళ్తుండగా స్ట్రెక్చర్ విరిగిపోయింది. కాలం చెల్లిన స్ట్రెక్చర్లు ఇప్పటికీ ఆసుపత్రుల్లో వాడుతున్న కారణంగా ఈ దుస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆస్పత్రిలో వీల్ చైర్ లు లేని కారణంగా బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షేత్రగాత్రులు అంబులెన్స్ దగ్గర నుండి ఆసుపత్రిలోకి నడుచుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి దాపరించింది. బస్సు ప్రమాదం వల్ల జరిగిన తీవ్ర గాయాలు నొప్పుల బాధతో వారు ఆసుపత్రిలోకి వెళ్లడానికి నరకయాతన పడవలసిన పరిస్థితి నెలకొంది. అలాగే బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని వికారాబాద్ లోని వివిధ ఆస్పత్రిలో చేర్పించడానికి అంబులెన్స్ బయలుదేరింది. కానీ మార్గమధ్యంలో రైల్వే గేట్ ఉన్న కారణంగా సకాలంలో అంబులెన్స్ ఆసుపత్రికి చేరని కారణంగా గాయపడిన ఒక వ్యక్తి మృతి చెందాడు. దాదాపు 15 నిమిషాల పాటు వికారాబాద్ తాండూర్ రోడ్డు మార్గంలో రైల్వే గేట్ వేశారు. గాయపడిన వారికి సకాలంలో చికిత్స అందించని కారణంగా మృతి చెందవలసిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ప్రతిసారి రైల్వే గేట్ వేసినప్పుడు తాండూర్ నియోజకవర్గం నుంచి కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అంబులెన్స్ రావడం ఆలస్యంగా ఆసుపత్రికి చేరడం వంటి సంఘటనల జరుగుతున్న కారణంగా రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వే అధికారులు రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో రైల్వే గేట్ ఇబ్బందులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి చేశారు.

# నాగోల్‌లో 'ఇన్నర్ బ్లూమ్' నూతన శాఖ ప్రారంభం

- ప్రజలకు సమగ్ర మానసిక ఆరోగ్య, వెల్‌నెస్ సేవలను
- చేరువ చేయడమే లక్ష్యం డా. నోముల వెంకటేశ్వర్లు




**హయత్ నగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి)** గాంధీ జయంతి సందర్భంగా నాగోల్ సాయి నగర్ కాలనీలో రావు కాంప్లెక్స్‌లోని శివప్రియ స్పెషాలిటీ క్లినిక్స్‌లో 'ఇన్నర్ బ్లూమ్ -- ఇంటిగ్రేటెడ్ సైకాలజికల్ అండ్ వెల్‌నెస్ సర్వీసెస్' నూతన శాఖను ప్రారంభించారు. ఈ శాఖను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు, సీనియర్ గైనకాలజిస్ట్, సైకాలజిస్ట్ డా. ధనశ్రీ నాయుడు, రిటైర్డ్ ఎస్.పీ., సైకాలజిస్ట్ శ్రీ చెన్న రాజా ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్నర్ బ్లూమ్ గ్రూప్ ఆఫ్ సైకాలజికల్ కౌన్సెలింగ్ సెంటర్స్ వ్యవస్థాపకులు డా. నోముల వెంకటేశ్వర్లు, సీనియర్ పీడియాట్రీషియన్, చైల్డ్ కౌన్సెలర్ డా. వి. మార్కండేయులు, సీనియర్ సైకాలజిస్ట్, మ్యూజిక్ థెరపిస్ట్ వైదేహి దలాల్, డా. అన్వేష్, శ్రద్ధ రిహాబ్‌కు చెందిన డా. ఈరేష్, డా. భాస్కర్, డీఎంహెచ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్వీకార్ గ్రూప్ వ్యవస్థాపకులు పద్మశ్రీ డా. పి. హనుమంతరావు, డా. జి.వి. ప్రకాష్, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. మోతుకూరి రామచందర్ తదితరులు ఇన్నర్ బ్లూమ్ అందిస్తున్న మానసిక ఆరోగ్య సేవలను అభినందించి నూతన శాఖకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసీజీ ఫౌండేషన్ సభ్యులు కూడా సంస్థ సేవలను అభినందించారు.
ఇన్నర్ బ్లూమ్ వ్యవస్థాపకులు డా. నోముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా హుజూర్‌నగర్, కోదాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉచిత మానసిక కౌన్సెలింగ్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, కుటుంబాలు, మానసిక సహాయం అవసరమైన వారికి నిరంతరం కౌన్సెలింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు.
సేవలను మరింత విస్తరించడంలో భాగంగానే నాగోల్‌లో నూతన శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్, వెల్‌నెస్ సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. ఇన్నర్ బ్లూమ్‌లో చైల్డ్ అండ్ అడోలెసెంట్ కౌన్సెలింగ్, సైకాలజికల్ కౌన్సెలింగ్, ఫ్యామిలీ అండ్ మ్యారిటల్ కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్, లైఫ్ స్కిల్స్, మ్యూజిక్ థెరపీ, మైండ్‌ఫుల్‌నెస్, యోగా, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మహిళల మానసిక ఆరోగ్యం, డీ-అడిక్షన్, రిహాబిలిటేషన్ గైడెన్స్ వంటి సేవలు అందించనున్నట్లు తెలిపారు. డా. వి. మార్కండేయులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, కుటుంబ సంబంధాల పరిరక్షణకు కౌన్సెలింగ్ సేవలు ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి సమగ్ర మానసిక ఆరోగ్య సేవలు నేటి సమాజానికి అవసరమని పేర్కొంటూ నాగోల్‌లో ఇన్నర్ బ్లూమ్ నూతన శాఖ ప్రారంభం కావడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సైకాలజిస్టులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రముఖులు, ఈసీజీ ఫౌండేషన్ సభ్యులు ఇన్నర్ బ్లూమ్ నూతన శాఖకు శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను మూడు నెలల్లో భర్తీ చేయాలి

## డి.ఎస్.డి రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్

**ముషీరాబాద్, అక్టోబర్ 3 (జనంసాక్షి):** దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను ప్రభుత్వం జి.ఓ. నం.19 ప్రకారం మూడు నెలల్లోగా భర్తీ చేయాలని డి.ఎస్.డి రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. వెంకటేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం సంక్షేమ భవన్‌లో రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్వేశ్వర్ ను కలిసి పూల బొకే అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను జి.ఓ. నం.19 ప్రకారం నిర్ణీత గడువులో భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగాల నోటిఫికేషన్లలో బోగస్ దివ్యాంగుల ధ్రువపత్రాలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిజమైన దివ్యాంగులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాల్లో తగిన ప్రాధాన్యత కల్పించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమాకుమార్, సుక్కయ్య, అజాం, సయ్యద్ జకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ కులాల గణన కోసం ఛలో శంషాబాద్

## ఎల్బీనగర్ నుంచి భారీగా తరలిరావాలి మధుయాష్కి గౌడ్

ఎల్బీనగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి) : జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌తో టీపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న శంషాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ తెలిపారు. శంషాబాద్‌లోని గొల్లపల్లి రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఈ సభకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి ఓబీసీలు, ఓబీసీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఓబీసీ కులాల గణనను కూడా చేపట్టాలని, తద్వారా ఓబీసీల జనాభా ఆధారంగా వారికి అవకాశాల్లో తగిన వాటా దక్కేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈ సభ నిర్వహిస్తున్నట్లు మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. ఓబీసీ కులాల గణన కోసం చేపడుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, శంషాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

# ఘట్‌కేసర్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు విద్యార్థులకు గాయాలు

**ఘట్‌కేసర్,(జనం సాక్షి):** పోలీస్ స్టేషన్ పరిధిలోని మాధవరెడ్డి బ్రిడ్జిపై శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్న రాకెల సాయి సిద్ధార్థ్, అన్నెపోగు శివ ప్రసాద్‌లు శనివారం ఉదయం సుమారు 8.50 గంటలకు కేటీఎం ద్విచక్ర వాహనం (టీజీ08బీబీ8815)పై కాలేజీకి బయలుదేరారు. సాయి సిద్ధార్థ్ వాహనం నడుపుతుండగా, శివ ప్రసాద్ వెనుక కూర్చున్నారు. మాధవరెడ్డి బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టాటా ఏస్ గోల్డ్ గూడ్స్ వాహనం (టీఎస్10యూసీ4681) డ్రైవర్ లెంక రమేష్ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ విద్యార్థులు ప్రయాణిస్తున్న లేన్‌లోకి వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సాయి సిద్ధార్థ్ తల కుడివైపు, కుడి భుజానికి గాయాలు కాగా, శివ ప్రసాద్ కుడి చేతికి ఫ్రాక్చర్ అయింది. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో ఈసీఐఎల్‌లోని శ్రీకర హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేసి ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి

- ఓటు హక్కును కాపాడేందుకు ప్రజలు శాంతియుతంగా ఉద్యమించాలి : సినీ నటుడు ప్రకాశ్ రాజ్



**ఖైరతాబాద్; అక్టోబర్ 03 (జనం సాక్షి) :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేసి, గతంలో ఉన్న ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఎస్ఐఆర్ అంశం, ప్రస్తుత రాజకీయ పరిణామాలు అనే అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ నాయకులు ప్రతాపరెడ్డి, తెలంగాణ డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటదాస్, తెలంగాణ డెమోక్రటిక్ ఫోరం వినాయక్‌రెడ్డి తదితరులు కలిసి ఆయన మాట్లాడారు. .కర్ణాటకలోని 23 జిల్లాల్లో 100 పోలింగ్ బూత్‌లను పరిశీలించి, ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులను అధ్యయనం చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న పలువురి పేర్లు జాబితా నుంచి తొలగించబడినట్లు తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. ఈ వివరాలను ప్రజల నుంచి సేకరించిన సమాచారంతో సహ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించే విషయంలో స్పష్టమైన విధానం, పారదర్శకత అవసరమని ఆయన అన్నారు. ఉపాధి, ఇతర కారణాలతో వలస వెళ్లిన వారు కొంతకాలం తమ నివాసంలో లేకపోతే వారి ఓటు హక్కును తొలగించడం సరికాదని అన్నారు. పేదలు, ఆదివాసీలు, మహిళలు తదితర వర్గాలు ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు ముందు కూడా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండేదని, ఇప్పుడు చేపట్టిన ప్రత్యేక సవరణలో అర్హత కలిగిన ఓటర్లు తమ అర్హతను మళ్లీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రకాశ్ రాజ్ ప్రశ్నించారు. అక్రమ వలసదారుల సమస్య ఉంటే ఇంతకాలం కేంద్ర ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని కోరారు. 2023 నుంచి ఎన్నికల సంఘానికి సంబంధించిన కీలక ఫైళ్లన్నింటినీ సుప్రీంకోర్టు తెప్పించుకుని పరిశీలించాలని ఆయన కోరారు. ఎన్నికల సంఘం వ్యవస్థకు సంబంధించిన 2023 చట్టపరమైన మార్పులను, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కల్పించిన న్యాయపరమైన రక్షణను కూడా పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కూడా ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైన ప్రాథమిక హక్కు అన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతుగా కాకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా ప్రజా ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ప్రజలు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# కోట్‌పల్లి మండలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ?

## ఆహార దుకాణాలపై పర్యవేక్షణ ఏది?

**కోట్‌పల్లి, అక్టోబర్ 3 (జనంసాక్షి):** మండలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ జరుగుతున్నాయనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, కిరాణా దుకాణాలు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలు కొనసాగుతున్నప్పటికీ ఆహార భద్రత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, గడువు ముగిసిన పదార్థాల విక్రయాలు, కల్తీ ఆహారం వంటి అంశాలపై అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. అయితే కోట్‌పల్లి మండలంలో తనిఖీలు కనిపించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాల విషయంలో నిర్లక్ష్యం జరిగితే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు మండలంలోని ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి నిబంధనలు పాటిస్తున్నారా లేదా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు కోట్‌పల్లి మండలంపై దృష్టి సారించి, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డుపై విషాదం.. మహిళ మృతి

**శంకర్ పల్లి,అక్టోబర్ 3 (జనం సాక్షి)**
అనంతగిరి ఘాట్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ గ్రామానికి చెందిన మహిళ మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది. దారూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి మృతి చెందడంతో బంధువులు ప్రైవేట్ బస్సులో అంత్యక్రియల కోసం బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ బస్సులో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన సుమారు 56 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఈ బస్సులో ప్రయాణిస్తున్న వారిలో శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ గ్రామానికి చెందిన రాజెంద్ల ప్రమీల (56) ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# రాష్ట్రానికే ఆదర్శంగా 'గ్రీన్ కరీంనగర్'

- పచ్చదనం, పరిశుభ్రతలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం అభినందనీయం
- ఆత్మవిశ్వాసంతో అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- 'గ్రీన్ కరీంనగర్'కు శాఖల సహకారం అందిస్తాం : కలెక్టర్ చిత్రా మిశ్రా
- అర్హులకు రేషన్ కార్డులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 3 (జనంసాక్షి):** పచ్చదనం పెంపు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ట్రాన్స్‌జెండర్ల ఆధ్వర్యంలో చేపట్టనున్న 'గ్రీన్ కరీంనగర్' కార్యక్రమం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందిన ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ట్రాన్స్‌జెండర్లలో అనేక మంది విద్యావంతులు, వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగినవారు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. తమ ప్రతిభకు తగిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సమాజం లో ప్రత్యేక గుర్తింపు పొందేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు.
ఆదర్శ్ హెల్పింగ్ హ్యాండ్స్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించనున్న 'గ్రీన్ కరీంనగర్'లో ట్రాన్స్‌జెండర్లు వాలంటీర్లుగా భాగస్వాములు కావడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమానికి మున్సిపల్, అటవీ, పంచాయతీరాజ్ తదితర శాఖల సహకారం అందించేందుకు అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ అడ్వైజర్ ఈవీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షురాలు ఆశ, ప్రతినిధులు సింధు, రోహణ, వైష్ణవి, పూజ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

## టీఎంయు రాష్ట్ర జనరల్ సెక్రటరీ థామస్ రెడ్డి

**సూర్యాపేట (జనంసాక్షి):** టీజీఎస్ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టిఎంయు, ఇయు, ఎన్ఎంయు జేఏసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జేఏసీ నాయకులు, టిఎంయు జనరల్ సెక్రెటరీ థామస్ రెడ్డి అన్నారు. శనివారం టీజీఎస్ ఆర్టీసీ సూర్యాపేట డిపో వద్ద జేఏసీ ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీని గెలిపించాలని కోరారు. తమ జేఏసీ అత్యధిక ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. కార్మికులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం క్లాస్ 3లో బస్సు గుర్తుకు, క్లాస్ 6లో నిచ్చెన గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆర్టీసీ ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇయు రాష్ట్ర అధ్యక్షులు బాబురావు, రహిముద్దిన్, మేకల శ్రీనివాసరావు, పాటి అప్పారావు, నరేందర్, రాఘవరెడ్డి, డివి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి

- బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలి..




**ముషీరాబాద్, అక్టోబర్ 3 (జనం సాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇందిరాపూర్ వద్దగల ధర్నా చౌక్ లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీజేపీ, నవజవాన్ భారత్ సభ, దిశ విద్యార్థి సంఘం, మజ్దూర్ బిగుల్, రెవల్యూషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తదితర మొత్తం 12 ప్రజా సంఘాలు ఈ ఆందోళనలో పాల్గొన్నాయి. పాత ఫారం–6 విధానంలోనే కొత్త ఓట్లను నమోదు చేయాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో వక్తలు డిమాండ్ చేశారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సినీనటుడు ప్రకాష్ రాజ్, పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, సూరేపల్లి సుజాతతో పాటు పలువురు మాజీ అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రజలంతా ఒక్కటై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆదివాసీలు, మైనారిటీలు, దళితులు సహా పలు వర్గాల ఓట్లు తొలగిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే నిలిపివేసి, ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్ల అభిప్రాయాలకు భిన్నంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరించారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను సీఈసీ పదవి నుంచి తొలగించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై కేంద్ర ప్రభుత్వాన్ని, 'రంగా–బిల్లా'గా సంబోధించిన ప్రధాన నాయకత్వాన్ని ప్రశ్నించాలని ప్రకాష్ రాజ్ కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి, ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారు.

# ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

- మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం..
- ఆటో ఛార్జీని కిలోమీటర్‌కు రూ.14కు పెంచాం
- 2014 తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదు..
- ఉద్యమాలు చేసినా నాటి పాలకులు స్పందించలేదు
- ప్రజల అజెండాతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్ లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు ఇచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆటో కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలన్నింటినీ మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలనే అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల నాయకులతో భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లోతుగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆటో ఛార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం.. కేబినెట్‌లో చర్చించి కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఛార్జీని రూ.14కు పెంచుతూ జీఓ జారీ చేసిందన్నారు.

### సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ

రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్టసభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు కోరుతున్న ఇతర అంశాలపైనా కొంత సమయం తీసుకుని న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ప్రస్తుతం పెంచిన రూ.14 ఛార్జీ సరిపోతుందా అనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు.

### ప్రజల అజెండాతో ప్రజా ప్రభుత్వం

కేవలం జీఓలు జారీ చేసి ప్రచారం చేసుకోవడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని అన్నారు. ప్రజాభవన్‌కు ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులను ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. ప్రభుత్వం తమది, ప్రజలదే అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు.

### డీజిల్ ఆటోలకు బదులు బ్యాటరీ ఆటోలు

హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. నగరంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలుష్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. డీజిల్ ఆటోలను బ్యాటరీ ఆటోలుగా మార్చేందుకు 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమం కింద రూ.200 కోట్లను కేటాయించామని తెలిపారు. ఒక్కో ఆటోకు ప్రభుత్వం తరఫున రూ.1.50 లక్షల సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో సోలార్, బ్యాటరీ, సీఎన్‌జీ ఆటోలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భట్టి విక్రమార్క అభినందించారు.

# జూరాల మిషన్ భగీరథ తాగునీటిపై ఆందోళన అవసరం లేదు

**మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి చంద్ర కుమార్ రెడ్డి**



**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 3 (జనం సాక్షి) :** మిషన్ భగీరథ పథకం ద్వారా జూరాల నుంచి జిల్లాలోని ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని శుద్ధి ప్రక్రియ అనంతరం నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షించి,నీటి నాణ్యతను నిర్ధారించిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ గద్వాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి చంద్ర కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ,ల్యాబొరేటరీలో ప్రతి రెండు గంటలకు ఒకసారి నీటి నమూనాలను పరీక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిర్వహిస్తున్న పరీక్షల్లో పీహెచ్, టర్బిడిటీ, బ్యాక్టీరియల్ నాణ్యత వంటి ప్రధాన ప్రమాణాల్లో ఎటువంటి ప్రతికూల ఫలితాలు నమోదు కాలేదని తెలిపారు. శుద్ధి చేసిన నీరు గ్రామాల్లోని నీటి నిల్వ కేంద్రాలు,పైపులైన్లు మరియు పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరే సమయంలో కూడా నీటి నాణ్యతను కాపాడటం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో నీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన అనంతరం మాత్రమే ప్రజలకు మరియు ఆవాస ప్రాంతాలకు సరఫరా చేయాలని సంబంధిత గ్రామ పంచాయతీలు, నీటి సరఫరా సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,క్లోరినేషన్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి,అవసరమైన నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తాగునీటిని సరఫరా చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. జూరాల మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,నీటి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ,ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. రవి చంద్ర కుమార్ రెడ్డి తెలిపారు.

# మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

- తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం
- ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీపై దర్యాప్తు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స
- వికారాబాద్‌కు వైద్య బృందం రాక
- జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ లోయలో పడి జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా అందజేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మీడియాకు తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం అందజేస్తామని అన్నారు. ఇదంతా వికారాబాద్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఉంటుందని వివరించారు .బస్సు ప్రమాదం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓం నమశ్శివాయ ట్రావెల్ ఏజెంట్స్ కి చెందిన ప్రైవేట్ బస్సులో పటాన్ చెరువు కేసారం గ్రామానికి చెందిన వారంతా ధరూరు మండలం చింతకుంట గ్రామంలో జరిగే అంత్యక్రియల్లో పాల్గొనడానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురి అయినట్లు తెలియజేశారు. ప్రైవేట్ బస్సులో ప్రయాణిస్తున్న వారంతా ఒకే కుటుంబానికి చెందిన బంధువులని అన్నారు. అనంతగిరి మూలమలుపు లోయలో బస్సు బోల్తా పడి నలుగురు మృతి చెందడం అనేకమంది తీవ్రంగా గాయపడడం బాధాకరమైన విషయం అని అన్నారు. వారి కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం మంత్రి ప్రభుత్వం తరఫున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. బీజాపూర్ హైవే తోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలో రోడ్ల నిర్మాణాలు జరుగుతాయని అన్నారు. ఇంతకాలం రోడ్ల నిర్మాణానికి కోర్టు కేసు అడ్డంగా ఉండేదని రోడ్ల నిర్మాణం జాప్యం జరిగిందని ఇప్పుడు సమస్య తీరిపోయినందున రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక చూపిస్తున్నట్లు తెలియజేశారు. రోడ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రమాదాలు నివారించడానికి ఎక్కడైనా ప్రమాద జోన్ ఉంటే గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీని మంత్రి ఆదేశించారు. అంతేకాకుండా బస్సు ప్రమాదంలో గాయపడ్డ వారికి పూర్తిస్థాయిలో చికిత్స అందించే వరకు జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాయపడిన వారంతా చికిత్స పొందుతున్నారని వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అక్కడినుంచి ప్రయాణిస్తున్న రియాజ్ అలీ సద్దాం సేవలు అభినందనీయం అన్నారు. రోడ్డు ప్రమాదం సమాచారం అధికారులకు అందించడమే కాకుండా ప్రత్యక్ష సహాయక చర్యలు చేపట్టి ప్రాణనష్టం జరగకుండా సాహసించడం హర్షించ దగ్గ విషయమై అన్నారు.



# భూపాలపల్లి ఆసుపత్రిలో తప్పిన ప్రమాదం..

- కూలిన నవజాత శిశువుల వార్డులో పైకప్పు సిమెంట్ ప్లాస్టరింగ్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం నవజాత శిశువుల వార్డులో పైకప్పు సిమెంట్ ప్లాస్టరింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. పెచ్చులు ఊడిపడటంతో సిబ్బంది, రోగుల బంధువులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఘటన సమయంలో అక్కడ పసిపిల్లలు, సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన చెందారు. పేద రోగులు నమ్ముకునే ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం విచారకరం. ఆసుపత్రి భవనాన్ని నిపుణులతో తనిఖీ చేయించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి

- మంత్రి శ్రీధర్ బాబు
- ప్రతి విశ్వవిద్యాలయంలోనూ స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్
- డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి
- జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'రీచ్––2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు.

విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.

'తెలంగాణ రైజింగ్ ఏ2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య కుదిరే నూతన భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతిపదికన మాత్రమే ఈ 'రీచ్' సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతలకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న పార్థు నర్సింగ్ హోమ్ సీజ్



**నెక్కొండ అక్టోబర్ 3 (జనం సాక్షి ):** నెక్కొండ మండల కేంద్రం లోని ఉపేందర్ హాస్పిటల్ లో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని నమ్మదగిన సమాచారంతో డాక్టర్ సాజిదా అతహరి, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ హెచ్ ఎన్ , డిఎం ఉ హెచ్ ఓ ఆఫీస్, వరంగల్ గారు మరియు నెక్కొండ రెవెన్యూ అధికారులు ఆర్ ఐ హంస నరేందర్, , గాదె అశోక్, జీపీవో పోలీసు అధికారుల సహకారంతో శనివారం రోజున నెక్కొండ లోని ఉపేందర్ హాస్పిటల్ పై దాడి చేయగా అక్కడ ఉపేందర్ హాస్పిటల్ యొక్క డాక్టర్ బాల్నే పార్థు, ఫిజియోథెరపిస్ట్ మంకాల గణేష్, నర్సు సముద్రాల పద్మ ఉన్నారు, ఇంకా వారి ఆధీనంలో ఒక గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష యంత్రం స్కానర్ కలిగి ఉన్నారు. దానిపై ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాజిదా విచారించగా డాక్టర్ బాల్నే పార్థు ఎలాంటి అనుమతులు లేకుండా చట్ట విరుద్ధమని తెలిసినా కూడా అక్రమంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఫిజియోథె రపిస్ట్ మంకాల గణేష్ సహకారంతో హైదరాబాద్ కు చెందిన నరేందర్ దగ్గర స్కానర్ కొనుగోలు చేసుకుని వచ్చి ఉపేందర్ హాస్పిటల్ లో మంకాల గణేష్ మరియు నర్సు సముద్రాల పద్మ సహకారంతో బాల్నే పార్థు గర్భిణీ స్త్రీలకు ముందస్తు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ అక్రమార్జన పొందుతున్నారు. ఇలా ఒక్కొక్క పరీక్షకు రూ.5,000/- వరకు గర్భిణీ స్త్రీలు, వారి కుటుంబ సభ్యుల నుంచి వసూలు చేస్తున్నారు. గతంలో కూడా బాల్నే పార్థు డాక్టర్ పై నెక్కొండ, మహబూబాబాద్, కమలాపూర్ లలో కేసులు అయినవి. ఇటీవల అయినవోలులో జరిగిన గర్భిణీ స్త్రీ, వారి పిల్లల హత్య కేసులో ఈ డాక్టర్ పార్థు లింగ నిర్ధారణ పరీక్ష చేసినాడు అని తేలడంతో ఆ కేసులో అతని జైలుకు పంపించి అతని హాస్పిటల్ ను సీజ్ చేయడం జరిగింది. మరల ఇప్పుడు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ లింగ నిర్ధారణ యంత్రం తీసుకొచ్చి పై ముగ్గురు కలిసి అక్రమంగా ఈ పరీక్షలు చేస్తూ ఒకవేళ గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని నిర్ధారణ అయితే అట్టి గర్భిణీ స్త్రీలను అబార్షన్ కొరకు మహబూబాబాద్‌కు చెందిన ఒక ఆర్ఎంపి, ఒక డాక్టర్ వద్దకు పంపించి అక్కడ అబార్షన్ చేయించి వారి ద్వారా కూడా కమిషన్ కింద డబ్బులు తీసుకుంటున్నారని తెలిసింది. ఈరోజు బాల్నే పార్థు, ఉపేంద్ర హాస్పిటల్, ఫిజియోథెరపిస్ట్ మంకాల గణేష్, చంద్రు గొండ గ్రామము, నర్సు సముద్రాల పద్మ, అమీనాబాద్, చెన్నారావుపేట మండలం లను పట్టుకుని డాక్టర్ సాజిదా అతహరి, ప్రోగ్రాం ఆఫీసర్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి గర్భస్థ లింగ నిర్ధారణ స్కానర్ యంత్రం అలాగే మూడు సెల్ ఫోన్లు, మాంకాల గణేష్ యొక్క ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. ఇంకా ఎవరైనా ఈ ముందస్తు గర్భం నిర్ధారణ చర్యలలో పాలుపంచుకున్నారని విచారణలో తేలితే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370